# HANNA KRUPA

**Christian Devotional Monthly Magazine**

**సంపుటి : 6** **సంచిక : 11**


**ప్రభువగు యెహోవాయే నాకు బలము**

## విషయసూచిక


| | | |
|---|---|---|
| నా కుటుంబము... | ఛీఫ్ ఎడిటర్ | 3 |
| బ్రాహ్మణ పూజారి..... | పరవస్తు | 4 |
| యజ్ఞము... | కీ॥శే॥ పండిట్ సి.హెచ్. ఫ్రాన్సిస్ | 6 |
| రక్షణకార్యము | శ్రీ జడ్. సి. దేవదానం, కర్నూలు | 8 |
| బ్రదర్ భక్తసింగ్ | డా॥ పి.చంద్రశేఖరరావు | 9 |
| అపొస్తలుడైన ఎబినెజరు | అనువాదం : యస్.ఎ.టి.ఆర్.ప్రసాద్ | 10 |
| మహాయజ్ఞము | రెవ.డా॥బి.శాంసన్, చెన్నై | |
| | రెవ.డా॥పి.జె.పంచరత్నం, నంద్యాల | 12 |
| మదర్ తెరీసా | యడవల్లి ప్రసాదరావు, హైదరాబాద్ | 14 |
| విశ్వాసంలో ఓ మెట్టు | కొడవటికంటి | 16 |
| బైబిలు జ్ఞానము | హన్నాకృప డెస్క్ | 18 |
| యేసుప్రభువు దర్శనం | కొడవటికంటి సాక్ష్యము | 19 |
| ఏప్రిల్ నెల ప్రశ్న | హన్నాకృప డెస్క్ | 24 |
| అత్యంత ప్రియమైన అమ్మ | శ్రీమతి బి.విమలారెడ్డి, హైదరాబాద్ | 25 |
| సువార్తలలోని యేసు కథ | కొడవటికంటి | 28 |
| ప్రార్థనా కొండ | హన్నాకృప డెస్క్ | 29 |
| న్యూస్ | హన్నాకృప డెస్క్ | 31 |


## చందా వివరములు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ.150 |
| జీవిత చందా | : | రూ. 3000 |
| పోషక చందా | : | రూ. 5000 |

ఆన్‌లైన్ అకౌంట్ నెం. : 10957294362
బ్రాంచి నెం. : 0890 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కె. సామ్యేల్ రాజేంద్ర, కృపాదానంవీధి, క్లౌపేట, ఒంగోలు


Founder :
**Kodavatikanti Emmanuel Rajendra,** B.A.,B.L.,

Editor :
**Nathaniel R. Kodavatikanti,** B.Th.,M.A.,(M.Phil)

Hon. Editor :
**A.N.R. Zakkam**
D.G.M., SOMA Enterprises, Rajasthan

Hon. Advisor :
**Yadavalli Prasada Rao**
D.A.O.,G.H.M.C., Hyderabad

Patrons :
**Dr. Y.S. Purushottam Reddy**
Superintendent, Rajareddy Hospital
Pulivendula

**Rev. Dr. K. Joseph**
Director, I.E.R.F. Ongole

**Rev. Dr. M.S. Santhavardhan**
Director, Good News Messenger, Guntur



**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప,
54-1-23 (A), కృపాదానంవీధి, క్లౌపేట,
6వ లైను, ఒంగోలు- 1.



# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

సంపాదకీయం

# నా కుటుంబము

5

నా కుమారుడా నీ తండ్రి ఉపదేశము ఆలకించుము నీ తల్లి చెప్పు బోధను త్రోసివేయకుము అని సామెతలు గ్రంథ ప్రారంభములోనే హెచ్చరించారు. బిడ్డలు తల్లిదండ్రుల నోట నుండి వచ్చే మాటలు వినాలి, గ్రహించాలి. ఇది కుటుంబము లోని బిడ్డల కొరకే కదా! ఒక తండ్రి తన బిడ్డలకు ఎప్పుడైనా ఉపదేశము చేశాడా? ఒక తల్లి తన బిడ్డలకు బోధించిందా? అదేమంటే సమయం లేదు, తీరిక లేదు, వాళ్ళేమైనా చిన్నపిల్లలా అంటారు. తల్లి, తండ్రి ఈలోకంలో జీవించినంత కాలము బిడ్డలందరూ చిన్నపిల్లలే.

ఎంతోమంది సువార్తికులు, సువార్తికురాండ్రు, పాస్టర్లు ఊరంతా బోధిస్తారు కాని తమ ఇంట్లో తమ బిడ్డలకు బోధించరు. కారణం? ఇంట్లో వారి ప్రవర్తన బిడ్డలకు బోధించే టంత స్థాయిలో లేదు. నా యింట యథార్థ హృదయముతో నడచుకొందును అని కీర్తనలు 101:2లో వ్రాయబడింది. ఇంట్లో యథార్థుడైన వాడు బయట కూడ అలానే ఉంటాడు.

తల్లిదండ్రులు పొరుగువారితో సమాధానముగా ఉండటం చూచిన బిడ్డలు వారి తరగతి గదులలో, ఉద్యోగం చేసే ఆఫీసుల్లో అందరితో సమాధానంగా ఉంటారు. ఇంట్లో ఉండి తమ పిల్లలతో ఇంట్లో లేడని చెప్పించే తల్లిదండ్రులు వారికి ఏ విధంగా ఉపదేశము చేసి బోధించగలరు? అది మనకు అసలు తప్పులాగా కనిపించకపోవచ్చును. కాని బిడ్డల మనసులో ఒక చెడు అలవాటుకు విత్తనము అవుతుంది.

అమెరికాలో 'పాసడీనా'లో వరల్డ్ విజన్ ఆఫీసులో 'ఎవ్రీ చైల్డ్ ఈజ్ యాన్ ఎక్స్‌పెరిమెంట్' అని వ్రాయబడి ఉండటం గమనించాను. అప్పటి నుండి పిల్లలను చూసే విధంలో నాలో మార్పు వచ్చింది. ఎప్పుడూ చిర్రుబుర్రులాడే వార్డన్‌లు వుండే హాస్టల్లోని పిల్లలందరూ కోపిష్టులుగా మారినట్లు ఒక సర్వేలో వెల్లడి అయింది. 'అనుకరణ' అనేది ప్రతి జీవిని మరణం వరకు వెంటాడుతూ వుంటుంది. పునాదిలో, పసితనంలో వారు చూసినది వినినది వారిలో నిలిచి వుంటుంది.

నాకు తెలిసిన ఒక పాస్టరుగారి భార్య నిత్యము తన భర్తను అవమానపరుస్తూ హింసిస్తూ వుంటుంది. ఆమె పెద్ద కుమార్తెకు వివాహమై అత్తవారింటికి వెళ్ళిన పదిరోజులలోనే పుట్టింటికి తిరిగి వచ్చింది. కారణం అడిగినప్పుడు 'నా భర్త నన్ను ప్రేమించడు' అన్నది. ప్రేమించడు అని నీకెలా తెలుసు? అని అడిగితే, నేను మా అమ్మలాగా ఒక్క మాట అన్నందుకే నన్ను ఇంట్లో నుండి పొమ్మన్నాడు అన్నది. ఎంత దుఃఖకరమైన విషయం. మరలా ఆమె ఎక్కడా నిలువ లేకపోయింది. కారణం ఎవరు? తాను పెరిగిన కుటుంబం, పెంచిన తల్లిదండ్రులు కాదా?

నా చిన్నతనంలో మూడవ తరగతి నుండే పాఠ్య పుస్తకాలలో నీతికథలు ఎక్కువగా వుండేవి. అవి బిడ్డల వ్యక్తిత్వాన్ని అంత చిన్నవయస్సులో మంచి మలుపు తిప్పేవి. 'అది మా పనికాదు' అనే పల్లకి బోయిల కథ, 'స్థలమార్పిడి' అనే కాకి కథ – ఇప్పుడు చదువులలో సైన్సు, ఇంగ్లీషు – మమ్మి, డాడి, యువకులను పెరగనివ్వడం లేదు. పెద్ద చదువులు చదివి. విమానం ఎక్కివెళితే సంతోషించే వారు దేవుని కార్యక్రమమును నెరవేర్చలేరు. ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి భూమిని నింపమంటే ఫలించకుండా కత్తిరించు కుంటూ, భూమిని నింపకుండా టవర్సులో నివసించే వారి మనోభావాలు ఎత్తులో వుంటాయే కాని విరిగి నలిగి వుండవు.

నేడు ఏ దుకాణమునకైనా వెళ్ళండి. ఎక్కువమంది గుమస్తాలు. ఎక్కువ రద్దీగా వుండేవి మందుల షాపులు. ఇది అభివృద్ధా? ఫలించడమా? నేలమీద నడిచే మానవుని బుద్ధికుశలత అంతస్తులో నడిచేవాని బుద్ధి కుశలత కంటే అనేకరెట్లు ఎక్కువ అని సర్వే నిరూపించింది. యంత్రాలవలె నివసించటం కంటే మనుష్యులలాగ జీవించే వారి ద్వారానే దేవుని నీతి బయలుపరచబడుతుంది. తన ఇంట్లో తన బిడ్డలతో కంటే ఎక్కువకాలము బయట నివసించే దేవుని సువార్తికుడైనా, మహా భక్తుడైనా తన బిడ్డల మీద ఆధిక్యత కోల్పోయి వారిని తనతో పాటు పరలోకరాజ్యమునకు వారసులుగా చేయలేకపోతున్నారు.

మనం వెళ్ళిపోయేటప్పుడు ఎన్ని స్థిరాస్థులు సంపాదిం చాము? అని కాదు గాని మనం సంపాదించింది బిడ్డలుకు ఎంతవరకు అనుభవములోనికి వస్తుంది అని తల్లిదండ్రులు గ్రహిస్తే నేడు పంచుకోవడానికి వీలు కాని ఆస్తులు పట్టణాలలో పెంటదిబ్బలుగా కనబడవు.

**"యథార్థవర్తనుడగు నీతిమంతుని పిల్లలు
వాని తదనంతరము ధన్యులగుదురు" సామె. 20:7.**

సాక్ష్యము



# బ్రాహ్మణ పూజారి సత్యాన్వేషణ

**" విహ్వ్యా గోప్తారాం మహక్యాదధిన కర్యుంతి హన్వా యాన పర్యతాసీన్ "**

మీకెటువంటి మరణకరమైన దుర్ఘటన చుట్టిముట్టినా, మీ పరిస్థితి ఎంత భయంకరమైనా సరే, మీ శ్రమలు, శోధనలు, ఇబ్బందులు మీకాయాసకరముగా వున్ననూ 'భయపడకుడి, నేనే నీ దేవుడనైయున్నాను. దిగులుపడకుము నేను నిన్ను బలపరతును. నీకు సహాయము చేయువాడను నేనే.. నిన్ను ఆదుకొందును' (యెష.41:10) అని మీ కొరకు వాగ్దానము చేయుచూ మిమ్ములను 'ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా నా యొద్దకు రండి నేను మీకు విశ్రాంతి కలుగజేతును' (మత్త.11:28) అని యేసు పిలుచుచున్నాడు. ప్రియ చదువరీ! ఈ క్షణమందే నీవు నీయవసరార్థమై నీకు సహాయము చేయుమని యేసును ప్రార్థించుము. మేజర్ కురియన్‌ను, కెప్టెన్ జి.కె.నాయర్‌ను, గుండె వ్యాధితో బాధపడుతున్న జె.సి.ఒను స్వస్థపరచి సహాయము చేసిన యేసు, నా ప్రాణమును, రామాసింగ్ ప్రాణ మును రక్షించిన యేసు, జోగాసింగ్‌కు దర్శనమిచ్చి స్వరము వినిపించిన ఆ ప్రభువు నీకునూ దర్శనమిచ్చి, స్వరము వినిపింపజేసి, స్వస్థపరచి సహాయము చేయ సమర్థుడు, నీవు రక్షింపబడుదువు. అవును. ఆమెన్.

టేంగావేలీలోనున్న నా గృహమునకు చేరితిని. రెబెక్కా గారికి చాలా సీరియస్‌గా వుండుటచే నేను గృహము చేరే సరికి చాలామంది ఆమె యొద్ద ప్రార్థించుచుంటిరి. ఆమెకు ప్రసవదినము సమీపించెను. అది మొదటి కానుపు గనుక దహంగ్‌లోనున్న మిలటరీ ఆసుపత్రిలో చేర్పించాను. ఐదు రోజుల వరకు ఆమెను లేబర్ రూములోనే (ప్రసవించేగది) వుంచారు. ఆమెను పరీక్షించాలని వైద్య నిపుణులు ఆ గదిలో ప్రవేశించారు. కారణం ఎవ్వరికీ అర్థంకాకుండా వుంది. ప్రాణాపాయకరమైన పరిస్థితి ఆమెకు సంభవించినది. సిజేరియన్ ఆపరేషన్ చేసి బిడ్డను తీశారు. జన్మించబోయే శిశువు గర్భములో ఐదు రోజులు వుండుటచే శరీరమందు ఉష్ణోగ్రత కోల్పోయెను. శిశువు గుండె కొన్ని క్షణాల కొకసారి బహు ఆలస్యంగా కొట్టుకొనుచుండెను. ఈ కారణంగా ఒక ప్రత్యేకమైన గదిలో ఎలక్ట్రికల్ రూం హీటర్స్‌పెట్టి ఒక ఊయలలో హాట్ వాటర్ బ్యాగ్స్‌పెట్టి దానిపై ఆ శిశువును పరుండబెట్టి 'మీ దేవునికి ప్రార్థించండి మా చేతులలో ఏమీ లేదు' అని వైద్యులు, నర్సులు అందరూ నాతో చెప్పసాగారు. ఆ విధంగా మూడు రోజుల వరకు శిశువును ఉంచారు. రెబెక్కాగారికి రెండురోజులు స్పృహలేకుండా వుంది. ఆమెకు రక్తం ఎక్కించారు. మరోవైపు సెలైన్ ఎక్కించి చికిత్స చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితులలో నేను ప్రార్థనలో పోరాటం సాగించాను. కన్నీటితో ప్రలాపించి దేవుని సన్నిధిలో రాత్రింబగళ్ళు గడిపితిని. 'నాయందు విశ్వాస ముంచువాడు చనిపోయినను బ్రదుకును, బ్రదికి నాయందు విశ్వాసముంచువాడు ఎన్నటికీ చనిపోడు' ఈ మాట నమ్ము చున్నావా? అని నా ప్రభువు యొద్ద విశ్వాస సహితమైన ప్రార్థన తుదిసారిగా చేశాను. పిమ్మట దేవుని స్తుతించాను. నాల్గవ రోజు ఉదయమున నేను ఆసుపత్రికి వెళ్లగా మేజర్ మ్యాథ్యూస్ డాక్టరుగారు 'మీ ప్రార్థన దేవుడు ఆలకించాడు, ప్రతిఫలము మీరు వచ్చి చూడండి అని నన్ను ఒక వార్డ్‌లోకి తీసుకెళ్ళి ఊయలలో ఆడుకుంటున్న ఒక మగ శిశువును చూపించాడు. దేవునికి స్తోత్రములు కలుగును గాక! ఆ ప్రక్కనే మంచముపైనున్న రెబెక్కాగారిని క్షేమంగా వుండటం చూశాను. ఎంత ఆశ్చర్యకరుడీ యేసు? పది రోజుల తర్వాత వారిని ఇంటికి పంపారు. పుట్టిన శిశువు యొక్క యే అవయవములు ఏ మాత్రమైనను అంగహీనంగా ఉండక పోవుట చూచి జనులు ఆశ్చర్యపడిరి. ఎందుకనగా, ఆ ప్రజలే రెబెక్కాగారు గర్భవతిగా వుండు సమయంలో నాగుపామును దాటినపుడు 'పుట్టబోవు శిశువు అంధుడవు తాడు సుమీ!' అని హెచ్చరించి యుండిరి.

కొన్ని రోజులు గడిచిన పిమ్మట స్వప్నమందు 'నా దాసుడైన పరవస్తూ, నీతో మాట్లాడవలసియున్నది లేచి నిలువుము' అనగా నేను లేచి నిలిచాను. 'నీవు త్వరగా ఇక్కడ నుండి లేచివచ్చిన చోటికి తిరిగి వెళ్లుము. నేను నీతో చెప్పువరకు అక్కడనే వుండు. ఈ ప్రాంతంలో హత్యా కాండ జరుగబోవుచున్నది. ప్రయాణమునకు సిద్ధపడు. నీ మార్గము నేను సరాళము చేతును' అన్నాడు. అంతలో నేను 'ప్రభూ! చిన్న శిశువుతో పురిటాలైన నా భార్యను, ఈ సామగ్రినంతటిని తీసికొని ఏ విధంగా ప్రయాణము చేయగలను? మరి కొద్ది దినములు ఇక్కడనే ఉండుటకు

తమరు నన్ను కటాక్షించండి' అని అన్నాను. అందుకు ప్రభువు 'దిగులు చెందకు. నీ మార్గమంతటిలో నేను నీకు తోడైయుందును' అని సెలవియ్యగా నేను సంతోషించాను. అంతట నేను దిగ్గున మేల్కొని చూడగా నా ప్రక్కన నా భార్య లేదు. పిల్లవాడు దీపపు వెలుగులో ఆడుకొనుచున్నాడు. నేను తొందరపడి మాకు వున్న గదులన్నీ వెదికాను. ఆమె ఒక గదిలో మోకరించి యుండుట చూశాను. నా అడుగుల శబ్దము విని ఆమె లేచినది. మేమిద్దరము ఆనందంగా ఒకరినొకరము చూచుకొని మందహాసము చేసుకొన్నాము. ఆమె ప్రభువును ప్రార్థించి 'మేమిప్పుడు ఏమి చేయాలో ఆజ్ఞాపించుము' అని ప్రార్థించినందుకు ఆమె ఆనందంగా ఉన్నది. దేవుని మెల్లని స్వరము విన్నందుకుగాను నేను సంతోషంగావున్నాను. నాకు కలిగిన దర్శన విషయము ఆమెకు వివరించాను. మేము తిరిగి ఒరిస్సా రాష్ట్రమునకు వచ్చుటకు ప్రయత్నము చేయగా 12 దినములలో ప్రభువు మాకు మార్గము సరాళము చేసెను. అప్పటికి నా కుమారుడు 28 రోజుల వయస్సుగలవాడు. అది ఎంత కష్టతరమైన ప్రయాణమో అంతకంటే ఎక్కువ సౌకర్యములు ప్రభువు మాకు మార్గములో కలిగించెను. ప్రతిచోట ప్రయాణీకులు మాకు సహాయపడినట్లు ప్రభువు మాకు సిద్ధపరచెను. 1978 జూన్ 16న మేము ఒరిస్సా వచ్చాము. ఆగష్టు 1978లో అరుణాచలప్రదేశ్ రాష్ట్రమందుగల క్రైస్తవ మిషనరీలను అచ్చటి బౌద్ధమతస్తులు కత్తివాతకు గురిచేసిరి. ఆ సంఘటన భారతదేశమంతటిని కదిలించింది. ప్రతి రాష్ట్రంలో క్రిస్టియన్ యాక్షన్ కమిటీలు స్థాపించబడి ఆయా రాష్ట్రముల యొక్క గవర్నర్‌లకు మెమోరాండములు వ్రాసి అరుణాచల ప్రదేశ్ రాష్ట్రములోని క్రైస్తవులపై జరుగుతున్న హత్యాకాండను అరికట్టవలసినదిగా ప్రాధేయపడుతు భారత రాష్ట్రపతికి అందించవలసినదిగా కోరారు. ఒరిస్సా రాష్ట్రమునకు శంకర్ దయాళ్‌శర్మగారు గవర్నర్‌గా వున్న రోజులవి. గవర్నరు గారితో స్వచ్ఛమైన హిందీభాష మాట్లాడుటకు ప్రభువు కడపటివాడనైన నన్ను ఏర్పరచగా జనులు నన్ను ఎన్ను కొనిరి. ఒరిస్సా క్రిస్టియన్ యాక్షన్ కమిటి తరుపున ప్రార్థనా పూర్వకంగా మేము అనేకులము గవర్నరు భవన్ వద్దకు వెళ్ళి ఆ మెమోరాండ మును యిచ్చియుంటిమి. ఆ భయంకర మైన పరిస్థితిలో నుండి ప్రభువు నన్ను రక్షించెను.

ఒరిస్సా రాష్ట్రం వచ్చాక భువనేశ్వర్‌లో కొన్నాళ్ళు మరియు ఖురాదరోడ్‌లో కొన్నాళ్ళు వున్నాము. నేను ఒరిస్సా రాష్ట్రములో వున్ననూ ఆంధ్ర రాష్ట్రము నుండి సేవ కొరకు ఆహ్వానములు అందుకొనేవాడను. ఒరిస్సాలో కూడా కొన్ని ప్రాంతాలలో ప్రభువు నన్ను తన సేవలో వాడుకొనెను. ప్రభువు మాకు రెండవ గర్భఫలమును అనుగ్రహించెను. రెండవ ప్రసవ సమయమందు పరిస్థితి భయంకరముగా కనబడెను. దేవుని సన్నిధిలో విచారించగా శస్త్రచికిత్స ద్వారా నీకు కుమారుడు కలుగునని ప్రభువు ప్రవచనము ద్వారా తెలియజేసెను. ఆలాగే మాకు రెండవ కుమారుని ప్రభువు అనుగ్రహించాడు. ఈ రెండవసారి రెబెక్కాగారికి సిజేరియన్ ఆపరేషన్ జరుగుటచే ఆమె చాలా బలహీనురాలాయెను. తత్ఫలితంగా ఆమెకు 14 భయంకరమైన వ్యాధులు సంభవించెను. ఇప్పటికిని ఆమె ఆ వ్యాధులతో పోరాటము చేయుచూ జీవించుటకు ప్రభువు కృపచూపియున్నాడు. అప్పటికి నేను ఇంకా ఉద్యోగంలోనే వున్నాను.

పెద్ద కుమారుని పేరు అరుణ్ పరవస్తు. రెండవ కుమారుని పేరు కిరణ్ పరవస్తు. రెండవ కుమారుడు జన్మించినపుడే ఉదరమందు ఒక భయంకరమైన వ్యాధి కలిగియుండెను. ఆ వ్యాధి కారణంగా కడుపు ఉబ్బుచు భయంకరమైన నొప్పిగా వుండేది. ఆ కారణంగా పాలు త్రాగలేకపోవుచుండేవాడు. ఒక సంవత్సరము వరకు వాడు బాధపడుచుండగా మేము అశాంతితో రోజులు గడుపుచుండే వాళ్ళం. అనేకమంది వైద్యులకు చూపించినందున చాలా ఆర్థిక వ్యయము కలిగింది. చిల్డ్రెన్ స్పెషలిస్ట్ దగ్గరకు నాలుగుసార్లు తీసుకొని వెళ్లాము. అయినను ప్రయోజనము లేకపోయెను. ఒకరోజు కిరణం బాధతో ఏడుస్తూవున్నాడు. ఆ బాధ నేను చూడలేక 'ప్రభువా! అడుగుడి మీకియ్య బడును' అని మత్తయి 7 అధ్యాయము 7వ వచనములో వాగ్దానమిచ్చియున్నావు. 10వ వచనములో 'మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి యీవుల నియ్యనెరిగి యుండగా, పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగు వానికి ఎంతో నిశ్చయముగ అంతకంటే మంచి యీవుల నిచ్చును' అని అభయమిచ్చుచున్నావు. ఈ యీవి ఎందుకు చెడ్డదిగా యిచ్చితివి? లేక నాలోగాని నా పరివారములోగాని నీకు విరుద్ధముగా వున్న లోపమేదైన మాకు తెలియకుండా మాలో వున్నదా? అలాగైతే అది నాకు బయలుపరచుము. దానిని మేము విడిచి పెట్టెదము లేదా నీవు ఆడిన మాటను నిరర్థకము కానీయకుము. నీవు అబద్దీకుడవు కావని నేను ఎరుగుదును. (సశేషం)

# యజ్ఞము



పండిత సిహెచ్. ఫ్రాన్సిస్

"అమంత్రం అక్షరం నాస్తి" కావున ఆ గురువు మొదటి అక్షర బ్రహ్మమగు ఓంకారమే. యోగదర్శనమందు పతంజలి యిట్లు వ్రాసియున్నాడు. "తస్యవాచకః ప్రణవః" అనగా "ఓమ్" ఈశ్వరుని నామము. ఇట్లు ఆదియందు వాక్యమై యున్న క్రీస్తుయేసే నిజమగు గురువు తానేనని పలికెను (మత్తయి 23:10). ఆదిగురువు మహాదేవుడగు యేసుక్రీస్తే సుమా! (తీతు 2:13). యోగదర్శిని ఈ విషయమునే సమర్థించుచున్నది. "స ఏషపూర్వేషామసి గురుః కాలేన, పచ్ఛేదాత్" (యోగదర్శిని 1:26). అనగా ఆ యేసు ఆది గురువైయుండి కాలముచేత వేరుచేయబడలేదు. "సత్యో మంత్రః" సత్యము (ఋగ్వేదము 1:152-2) సత్యమే క్రీస్తు (యోహాను 14:6). కావున జగద్గురు యజ్ఞము ద్వారానే తప్ప పాప క్షమాపణ కలుగదు. దేవోక్తులు యూదుల పరము చేయబడెను (రోమా 3:2). కావున యూదా ప్రవక్తలు క్రీస్తుయేసు సిలువను గూర్చి వందల సంవత్సరములకు పూర్వమే తేటగా లిఖించిరి. వారిలో దీర్ఘదర్శియగు యెషయా క్రీ.పూ. 700 సం॥ల క్రిందట యిట్లు వ్రాసెను - "మన అతిక్రమ క్రియలనుబట్టి అతడు గాయపరచబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది (యెషయా 53:5).

**ప్రశ్న :** మన పాపముల కొరకు క్రీస్తు సిలువ వేయబడినచో ఒకని ఆకలి కొరకు మరియొకడు అన్నము తినిన యెడల మొదటి వాని ఆకలి తీరునా?

**జవాబు:** తల్లి ఆకలితీర అన్నము తినుటచే ఆమె పాలు త్రాగి బిడ్డ ఆకలి తీర్చుకొనగలదు. బిడ్డ జబ్బుకు తల్లి పథ్యము చేయుటచేతనే అతనికి ఆరోగ్యము చేకూరుచున్నది. ఒకరు వెలిగించిన దీపము అనేకులకు కాంతి నిచ్చుచున్నది. యేసు ప్రభువు అందరికి తల్లివంటివాడు. ఆయనే లోకమునకు వెలుగైయున్నాడు (యోహాను 8:12). ఋణస్థుడు అప్పు చెల్లించని యెడల మధ్యవర్తి చెల్లించ వలసియుండును.

"దేవుడొక్కడే; దేవునికి నరులకును మధ్యవర్తియు ఒక్కడే. ఆయన క్రీస్తుయేస్తను నరుడు" (1తిమోతి 2:5). మరియు "మధ్యవర్తి ఎవనికి మధ్యవర్తికాడు. కాని దేవుడొక్కడే" (గలతీ. 3:20). క్రీస్తు అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణమునిచ్చుటకు వచ్చితినని చెప్పెను (మత్తయి 20:28).

**ప్రశ్న:** ద్విజత్వమెట్లు సిద్ధించును?

**జవాబు:** శ్లో॥ జన్మనాజాయతే శూద్రః కర్మణాజాయతే ద్విజః వేద పాఠంతు విప్రాణాం. బ్రాహ్మజ్ఞానంతు బ్రాహ్మణః అను వజ్రసూచికోపనిషత్తు వాక్యానుసారముగా పుట్టుకచేత ప్రతివాడు శూద్రుడై కర్మచేతనే ద్విజుడగుచున్నాడు. ద్వి= అనగా రెండవసారి; జ= జన్మించుచున్నాడు. అట్టివాడు వేద పఠనచే విప్రుడును, బ్రహ్మజ్ఞానముచే బ్రాహ్మణుడునగు చున్నాడు. జందెము వేసికొనుట వలన శూద్రత్వము పోదు; కాని యజ్ఞకర్మ వలననే ద్విజత్వము వచ్చుననుట నిశ్చయము. క్రీస్తు బలివలననే మనము ద్విజులమై దేవుని రాజ్యమునకు వారసులము కాగలము. "అతడు తనకుతానే అపరాధ పరిహారార్థ బలిచేయగా అతనికి సంతానము కలుగును" అని యెషయా ప్రవక్త ప్రవచించెను (యెషయా 53:10). కావున క్రీస్తును యెందరంగీకరించిరో వారందరికీ దేవుని పిల్లలగు టకు ఆయన అధికారమను గ్రహించెను. వారు దేవుని వలన పుట్టిన వారేగాని, రక్తము వలననైనను శరీరేచ్ఛవలననైనను మనుష్యేచ్ఛవలననైనను పుట్టినవారు కారు (యోహాను 1:12,13).

బళ్ళారిలో పూర్వము వకీలుగా నుండిన కీ.శే. శ్రీకోలా చలము శ్రీనివాసరావు, ఎం.ఏ.యల్.యల్.బిగారు నరమేధ అశ్వమేదాది యజ్ఞములు అను పుస్తకమందు వ్రాసినదేమనగా- తైత్తీయారణ్యకములో మృత్యుదేవతా! జనములను నశింప జేయు నీ సేననంతయును నేనీయాగ రహస్యము వలన నశింపజేయుదును అనియున్నది. ప్రపంచ సృష్టికర్త పురుష రూపమున తనను తాను బలిగా నిడుకొనుటయే యీ యాగమ రహస్యం. దైవరూపముననున్న పురుషుడు అప్పటికి నమృతత్వములేని దైవములకుగాను నర్థమర్త్య దేహమును ధరించి మర్త్యదేహమును బలిగానిడెను. శతపథ బ్రాహ్మణంలో - భూతకోటి క్షేమమునకు సృష్టికర్త తాను బలిపశువయ్యెనని యున్నది. అనగా ప్రపంచము వారి రాశియై నిలచి నశించు

కాలమున పురుషుడు ప్రపంచోద్ధారకుడై యాగమ విధిచే తనను తాను బలిగనిడుకొని సర్వమునందు తాను వ్యాపించి ప్రపంచమును రక్షించెను. ఇదే ధర్మమును బైబిలు కూడ స్థాపించుచున్నది. అందరికిగాను నొక్కడు మృతినొందుటచే అందరు మృతినొందినట్లని, ఆయన జీవించుటచే అందరు ఆయనలో జీవించినట్లని వ్రాయబడెను (2కొరింథీ. 5:14, 15). అందరిని పాపవిముక్తులుగాజేసి రక్షించుటకై పురుషుడొకడు తన దేహమును బలిగా నర్పించుకొనెనని హిందువుల సిద్ధాంతము. ఈ పురుషమేధ రహస్యమే క్రీస్తు మరణ పునరుత్థాన వృత్తాంతమును సైతము స్థిరపరచుచు పురాతన కాలమునుండి నమ్మియుండిరనునది తెలుపును.

గొప్ప విద్వాంసుడును, పరిశుద్ధుడునైన పౌలు యిట్లు వ్రాసెను. ఆ లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతినొందెను, సమాధి చేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను (1కొరింథీ. 15:3,4). క్రీస్తు స్వయంగా చెప్పినదేమనగా – లేఖనముల యందు మీకు నిత్యజీవము కలదని తలంచుచూ వాటిని పరిశోధించుచున్నారు. అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి (యోహా. 5:39). మరియు ఆయన "నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను" అని చెప్పెను (యోహా. 14:6).

పురుష సూక్తమందు వ్రాయబడిన విధంగా యాగముగ నర్పించుకొనిన విరాట్ పురుషుని వలన తప్ప వేయి కర్మల వలనైనను మోక్షప్రాప్తి కలుగదని శాయనాచార్యుల వారు భాష్యమందు వ్రాసిరి. "నాన్యం పంథావిద్యతే అయనాయ" ఇదిగాక వేరొక మార్గము లేదు. బ్రాహ్మణ పండితుడైన పురుషోత్తముడు క్రీస్తును తన స్వంత రక్షకుడుగా అంగీకరించిన తరువాత కొన్ని పుస్తకములు వ్రాసిరి. "కులాచార పరీక్ష" యను పుస్తకములో వారు వ్రాసినదేమనగా–

శ్లో॥ చతుర్వేద విదో విప్ర సూక్ష్మ బ్రహ్మం నవిదతి।
వేదభార భరక్రాంత స్సవై బ్రాహ్మణగర్ధభః॥

అనగా గంధపు చెక్కలను మోసి వాటి సువాసన నెరుంగని గాడిద యెటువంటిదో, చతుర్వేద విద్వాంసుడై యుండి సూక్ష్మ బ్రహ్మమును తెలియని విప్రుడును అటువంటి వాడేయని తాత్పర్యము.

కావున ఓ భారతీయులారా! వేదశాస్త్రములలో వ్రాయబడినట్లు మానవులను రక్షించుటకై భువిపైనవతరించి యజ్ఞమై మృత్యువును జయించి లేచి నమ్మిన భక్తులకు కన్పించి పరమునకేగి మరల భువికి వచ్చి పాపములేని, హింసలేని వసుధైక రాజ్యమును స్థాపించి పాలించనైయున్న ప్రజాపతి ప్రభువైన క్రీస్తేయని గమనించి ఆయనయందు విశ్వాసముంచి ఆత్మ రక్షణ పొంది ఇహ పరసుఖములకు యోగ్యులగుదురుగాక. క్రీస్తు రాజ్యములో మృతులైన భక్తులు సమాధులలో నుండి బయటకు వచ్చి మహిమ శరీరములను ధరించి పాలింతురు (ప్రకటన 20:4,6; ఫిలప్పీ. 3:21). యేసుక్రీస్తు దేవుడైతే ఎందుకు సిలువ వేయబడెను? అని ప్రశ్నించువారు గమనించవలసినదేమనగా –

1. యేసుక్రీస్తు అను గ్రీకు పదముల కర్ధమేమనగా, రక్షణాభిషిక్తుడు. తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును గనుక ఆయనకాపేరు పెట్టబడెను (మత్తయి 1:21). పాపులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణమునిచ్చుటకై క్రీస్తు సిలువ వేయబడెను (మత్తయి 20:28). తన ప్రాణము బలిగా పెట్టుటకును దానిని తిరిగి తీసికొనుటకును తనకు అధికారము కలదని క్రీస్తు చెప్పెను (యోహాను 10:17). రక్తము చిందింపకుండా పాపక్షమాపణ కలుగదు (హెబ్రీ. 9:22). కనుక క్రీస్తు సిలువవేయబడెను.

2. కృపాసత్యముల వలన దోషమునకు ప్రాయశ్చిత్తము కలుగును (సామె. 16:6). ప్రాణదానము చేయనిదే ప్రపంచమునకు పుణ్యము లేదు. మరియు కృపాసత్యములు కలిసి కొనవు. కాబట్టి క్రీస్తు సిలువ వేయబడెను.

(సశేషం)

## పాఠకులకు గమనిక

ఈ సంవత్సరము (2008) నుండి పత్రిక 32 పేజీలకు పెంచడమైనది. సంవత్సర చందా **150/-** రూపాయలకు పెంచడమైనది. మేము పంపించే పత్రిక 90% మందికి ఉచితంగా వెళ్తుంది. ఈ పత్రిక ఉచితంగా పొందుతున్న వారిలో ఎక్కువ మంది అన్యజనులే. అంటే చందా పంపించే కొద్దిమంది ద్వారానే ఈ పత్రిక నడిపించబడుతుంది. క్రమం తప్పకుండా చందా పంపే వారు మా సాహిత్య సేవలో మమ్ములను అర్థం చేసుకుని మాతో సహకరిస్తున్నందుకు వారికి మా కృతజ్ఞతలు. చందా పంపదలచిన వారు మా యొక్క బ్యాంక్ (S.B.I.) ఆన్‌లైన్ అకౌంట్ నెం. **10957294362** ద్వారా పంపవచ్చును. కనుక పాఠకులు గమనించ ప్రార్థన.

# రక్షణ కార్యము 2

**(ఏకపాత్రాభినయం)**

(కొంతసేపటికి...)

ఆదాము హవ్వను సమీపించుచున్నాడు. ఆహా! హవ్వ ఫలములను తినుచున్నది. ఆమె కొన్ని ఫలములను తిని, కొన్ని ఫలమును ఆదామునకు యిచ్చినది. చిత్రము, మహా విచిత్రము... ఆదాము కూడ ఆ ఫలములనారగించినాడు. అద్భుతము, మహా అద్భుతము... జయము... విజయము, సైతాను ఎత్తుగడ పారింది. టక్కరి మాటల చక్కని వారసుడు. (విజయ గర్వముతో అట్టహాసాలు)

ఈ లూసీఫర్ పన్నాగము, వ్యూహము ఫలించింది. అదిగో ఆజ్ఞాత్రికమమైంది వారి కన్నులు తెరవబడ్డాయి. వారు దిగంబరులని తెలిసి పొదల చాటున దాగినారు. పాపము, శాపము, మరణము ఉద్భవించనున్నాయి. (వికృతమైన నవ్వులు) దేవుడు వనమునకొచ్చు వేళ యిది. ఇక జరుగబోవు పరిణామముల పరికించెదు.

మహామహుడు చెట్టు దాపుననున్న ఆదాము హవ్వల నిజస్వరూపమును కనుగొన్నాడు. దయామయుడు ఉగ్రుడైనాడు. ఆయన రోషముగల దేవుడు. తన యాజ్ఞను అతిక్రమించిన వారిని శిక్షింపక మానడు. ఆయన దహించు అగ్ని. ఆయన తాపజ్వాలలకు ఈ లూసీఫరే దహింపబడి ఈ కురూపమును దాల్చినాడు. మరి ఆ తుచ్ఛ నరుడేలాగు భరించగలడు?

దేవ దేవుడు క్రోధముతో శపించుచున్నాడు. "నరుడు మన్నేగనుక మంటిపాలౌతాడు" "మరణము" – వికృత నవ్వు. "నారీ! ప్రసవ వేదనతో పిల్లలు కనును. ఆమెకు భర్త యెడల వాంఛ కలుగును. అతడు ఆమె నేలును". "వేదన, మోహము". "నరుని బట్టి భూమి శపింపబడినది" "శ్రమ, హింస" (నవ్వు).

ఏమి? నాకు శాపమా? నాకా శాపము? నేను మన్ను తినెదనా? నేను ప్రాకెదనా? నాకును స్త్రీ సంతానమునకును వైరమా? శాపమట.. శాపము.. (ఎగతాళిగా, వికృతంగా నవ్వు).

దేవా! నీ సర్వోన్నతమైన దివ్య సింహాసనమునకు 'కొంచెము' దిగువున ఆశీనుడనగు నేనూ! అభిషేకము పొందిన ప్రధాన కెరూబుడనైన నేనూ! వేకువ చుక్క, తేజో నక్షత్రమని పిలువబడు నేనూ! నాశనకర్తను, అమర్త్యుడనైన నన్ను... అగ్నిజ్వాల మెరుపులతో కొట్టి పరిశుద్ధ పర్వతము నుంచి పాతాళమున నరకలోకములో ఒక మూలను పడద్రోసితివే....

అంతకన్నానా నీ శాపములు... అవి నన్నేమి చేయగలవు? (బహు తిరస్కారముగా) అయినా.. స్త్రీ సంతానమునకు... ఈ నీచ స్త్రీ సంతానమునకు... నాకూ వైరమా?

ఊ...త్తు...!! అవమానము, భరింపలేని అవమానము. సర్వేశ్వరా! తిలకించితివిగా... ఈ లూసీఫర్ శక్తియుక్తులు.. ఆహా! యించుక తిలకించితివిగా... నీ స్వరూపమున, నీ పోలికతో, నీ స్వహస్తములతో నరుని నిర్మించి, వాని నాసికా రంధ్రములలో నీ జీవ వాయువు వూది నరుని జీవాత్మగా జేసితివి. అతడు ఒంటరిగా నుండుట యిష్టములేక అతనికి సాటియైన సహాయమును అనుగ్రహించితివి. వారిని దీవించి, ఫలించి, విస్తరించి, భూమిని నింపుడని ఆశీర్వదించితివి. ధరిత్రి యావత్తు వాని వశముజేసి, నరుని దానికి ఏలికగా జేసితివి.

ప్రేమ, అనురాగం, ఆదరణ, మమత, మమకారంతో చల్లనిపూట ఏదేను వనమున మధుర వచనములు వారితో పలుకవచ్చిన నీకు.. పగ, ద్వేషము, ఈర్ష్యాకావేశాలతో, పరాభవాగ్ని దహించుచుండ, ఈ వాయు మండలాధీశుడు... నీకిచ్చు బహుమానము... నీ సంతోషానందాల 'మొక్క'ను ఆదిలోనే త్రుంచి, కాలరాసితిని.

ఏదీ... నీ విధేయత ప్రతీక? ఏదీ నీ దైవత్వము? ఏదీ నీ ఆరాధన? నీ వ్రేలితోనే నీ కన్ను బొడిచితిని నీ ఆజ్ఞాతిక్రమమైనది. ఫలితం... పాపము.. మరణము...

దేవా! యింకా ఏమైనది. చూస్తూ వుండు... ఈ నీచ మానవుడు, చంచల స్వభావి, కృతఘ్నుడని నిరూపించెద. అతని వల్ల నీకు సంతోషానందాలా? అది కల్ల. నాలోని విషమును గ్రక్కి అవిధేయత, అవిశ్వాస్యత, అవినీతి, అపవిత్రత, వేషధారణ, దుష్టత్వము, దుర్మార్గతకు ప్రతీకలుగా నరజాతిని మార్చివేస్తా. ఈ భూమిని వల్లకాడుగా మార్చి నీ

(...మిగతా 30వ పేజీలో)

మార్గదర్శి

# బ్రదర్ భక్తసింగ్

భక్తసింగ్ రక్షింపబడిన తరువాత ప్రభువునకు విధేయుడై పరిచర్య చేయడానికి ఇండియాకు వచ్చాడు. ఆ రోజుల్లో భారతదేశంలో అనేకమంది మిషనరీలు, వాళ్ళ వాళ్ళ పద్ధతుల్లో సేవచేసే వాళ్ళు. కాని దేవుని పని దేవుడు ఆశించిన విధానంలో చాలావరకు కొనసాగలేదు. వాక్యానుసారంగా అనేక సంఘాలు నడవలేదు. అనేక సంఘాల్లో దైవసేవకంటే ధనసేవ ఎక్కువైంది. అనేకమంది ప్రజల్లో ఆత్మీయ ఆకలి పెరిగింది. అటువంటి సమయంలో సహోదరుడు భారత దేశానికి వచ్చి 'ది రైజ్ ఆఫ్ ఇండిజనస్ చర్చస్ ఇన్ ఇండియా' అనే సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ యొక్క ముఖ్య వుద్దేశం ఏ సంస్థతో పొత్తులేకుండా స్వయంగా పని చేయడం. డబ్బుకోసం ఎవరిపై ఆధారపడకుండా దేవునిపై ఆధారపడి సేవ చేయడం. సహోదరుడు మొదటి నుండి దేవునిపై ఆధార పడి దేవుని చిత్తప్రకారం నడిచేవాడు.

సంఘానికి కొన్ని కట్టుబాట్లను ఏర్పరచినట్లు హెబ్రోను సంఘ విషయంలో ఇంతకు ముందు మనం చూశాం. సహోదరుడు ప్రతి చిన్న విషయాన్ని కూడా ధార్మిక దృష్టితో చూసేవాడు. అంతేకాక ప్రతి చిన్న పనిని కూడ నమ్మకంగా చేసేవాడు. దేవునిపై ఆధారపడేవాడు. చేతల్లో కానీ, తలంపుల్లో కానీ, మానవతకు చోటు ఇవ్వడు. ప్రతి పని దేవుణ్ణి సంతోష పెట్టడానికే చేసేవాడు. బ్రదర్ విశ్వాసంలో క్రీస్తుని చూడ గలము, సిలువ మరణ ఆనందాన్ని అనుభవించగలము.

ఒకరోజు డజను మంది వివిధ శాఖలకు సంబంధిం చిన పాస్టర్లు మద్రాసులో బ్రదర్ చేస్తున్న పరిచర్యను గురించి తెలుసుకొని దర్శించడానికి వచ్చారు. సహోదరుడు ప్రార్థించిన తరువాత బ్రదర్‌పై రెండు నిందల్ని వారు మోపారు. అవి 1. ఆదివారం కార్యక్రమాల్ని జరుపడం, 2. రెండవసారి బాప్తిస్మం ఇవ్వడం. ఆ పాస్టర్లు మోపిన ఈ నిందల్ని సహోదరుడు విని 'అసలు మీలో ఎవరి ద్వారా నా పాపాల్నుండి నేను రక్షింప బడలేదు. నేను మీ బోధ ద్వారా తిరిగి జన్మించలేదు. మీలో ఏ ఒక్కరూ నన్ను దేవుని సేవకు పిలువలేదు. ఆయన వాక్యం ద్వారా నా ప్రభువు ద్వారా రక్షింపబడ్డాను. అంతేకాక ఆయనే నన్ను తన సేవకు పిలిచాడు. కాబట్టి నేను ఆయనకు, ఆయన వాక్యానికి లోబడాలి. నా కూటాల్లో నేను ఎప్పుడైనా బైబిల్లోని ఏ భాగానికైనా విరోధంగా చెప్పినట్లుంటే దయచేసి చెప్పండి. దేవుడు నాకు ఏది బోధించాడో దాన్నే నేను ఇతరులకు బోధించాను. అదే సమయంలో మా కూటాలకు హాజరుకమ్మని ఎవ్వరినీ బలవంతం చేయలేదు. వాళ్ళంతట వాళ్ళు వస్తున్నారు. మేము వాళ్ళ డబ్బును ఆశింపలేదు. మేము సభ్యత్వం కోసం చందా తీసుకోవడం లేదు. మా సభ్యులని తెలిపే ఏ పట్టీ పుస్తకం మా దగ్గర లేదు. మా కూటాలకు వచ్చే వాళ్ళకి మేము ఏమీ ఇవ్వడం లేదు. ఈ ఇల్లు దేవుని కోసమే. ప్రతి ఒక్కరూ ఇక్కడకు రావచ్చును. ఇక్కడకు రావద్దని ఎవరికైనా ఎట్లు చెపుతాం? అని వాళ్లతో చెప్పాడు. అప్పుడు ఒక పొడుగాటి మనిషి లేచి 'అయితే శిశువులకు బాప్తిస్మం ఇచ్చిన మా భక్తిగల పితరులందరూ తప్పు చేశారంటావా?' అని అన్నాడు. అప్పుధు బ్రదర్ వాళ్లతో 'మా తాత, తండ్రి ఎంతో ఘనతగల వాళ్ళు. అయితే నేను మా తాతగారిని అనుసరిం చాలా లేక బైబిలునా? శిశు బాప్తిస్మం సరైందని రుజువు చేయడానికి బైబిల్లో ఏదైనా వచనం వుందా? దయచేసి చెప్పండి' అని అన్నాడు. ఆ సమయంలో వాళ్ళు 'మేము దానికి సిద్ధపడి వస్తాం' అని అన్నారు. అయితే వాళ్ళు మళ్ళీ ఎన్నడూ సహోదరుణ్ణి కలవలేదు. దేవునికి సంబంధించిన విషయంలో ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ఖచ్చితంగా ఖండించి తన ధార్మికతను చాటుకుంటాడు. సహోదరుడు భక్తసింగ్ రాజీపడని రాజకుమారుడు. ఏ వ్యక్తికీ భయపడక దేవుడు ఆజ్ఞాపించిన దాన్ని ధైర్యంగా బోధించాడు. నామకార్థ క్రైస్తవుల్లో దాగివున్న అవినీతిని దుయ్యబట్టాడు. ఒక దినం మద్రాసులో పురుష వాకంలో జరిగే కూటములో ఒక వ్యక్తి నవ్వుతూ స్త్రీలవైపు చూస్తున్నాడు. అప్పుడు సహోదరుడు తన ప్రసంగాన్ని ఆపి అతని దగ్గరకు వెళ్ళి అతన్ని మందలించాడు.

బ్రదర్ దేవుని వాక్యాన్ని చదివి అందులో వున్న సత్యాన్ని సంపూర్ణంగా గ్రహించాడు. ఎవరైనా బైబిలు చదివి మిడిమిడి జ్ఞానాన్ని సంపాదించి గర్విస్తే వాళ్ళని ఖండించేవాడు. సహో దరుడు చెప్పిన ఒక ఉదాహరణ చూద్దాం. ఒక వ్యక్తి 106 పుస్త కాల పేర్లను వ్రాసుకొని తెచ్చాడు. అతడు మంచి ధనవంతుడు ఆ 106 పుస్తకాల్ని చదివితే గొప్ప మేధావినవు తాడని అతడి ఉద్దేశం. ఆ పుస్తకాల్ని చాలా జాగ్రత్తగా పరిశీలించి చదివేవాడు.

గత నెలలో ప్రచురించబడిన **'బైబిలు జ్ఞాన పరీక్ష'**ను కొన్ని అనివార్య కారణముల వలన వాయిదా వేయడం జరిగింది. మరలా ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేయగలము.

సాక్ష్యము

# అపోస్తులుడైన బి.వి ఎబినెజరు

3

ఇకనుంచి మనుష్యులను పట్టే జాలరి పని చేయాలని సంకల్పించుకున్నాడు. దేవునిపై ఆధారపడి ఆత్మల సంపాదన చేయాలని తుది నిర్ణయము తీసుకున్నాడు. యేసుప్రభువు ఆ తీర్మానమును గౌరవించి ఆయనను అన్ని విధాల బలపరచి ఆదుకొని ముందుకు నడిపించుచున్నాడు.

బ్రదర్ ఎబినెజరుగారు సువార్త దండయాత్రలు కొన సాగిస్తూ అనేకమందికి రోగాలు, జబ్బులు బాగు చేస్తూ స్వస్థత సువార్త కూటములు జరిగించుచుండెను. ఒకరోజున కడప నుండి కొందరు వ్యక్తులు థైరాయిడ్ గ్రంథి పెరుగుట వలన కలిగిన జబ్బుతో వచ్చెను. యేసుక్రీస్తు నామములో ఆయన ప్రార్థించినపుడు ఆమెకు స్వస్థత చేకూరెను. ఈ అద్భుత స్వస్థతకార్యము ఆ జిల్లాలో అనేకమందిని యేసుక్రీస్తు దగ్గరకు నడిపించుటకును మరియు అనేకమందిని ఉజ్జీవింప చేయుట కును కారణమైనది. చుట్టుప్రక్కల ఊళ్ళ జనమంతయు ఎబినెజరు సేవద్వారా యేసుక్రీస్తు చేయుచున్న అద్భుతాలను చూడడానికి మరియు అనుభవించడానికి వచ్చుచుండిరి. మదనపల్లిలోని సి.యస్.ఐ. గ్రౌండ్స్‌లో జరిగిన సువార్త దండయాత్రలో మొదటిరోజునుండి అనేకమంది వచ్చి ప్రభువును రక్షకునిగా అంగీకరించిరి. ఈ సువార్త దండ యాత్రను దాదాపు 21 రోజులు కొనసాగించిరి. దాదాపుగా 11,000 మంది సువార్త కూడికలకు హాజరై రక్షింపబడిరి.

సువార్త కూడికలలో దయ్యములచేత పీడింపబడుచున్న అనేకమంది ఎబినెజరుగారి గొంతును మైకు ద్వారా విన్నప్పుడు అవి పారిపోవుచున్నవి. ఆయన యేసు నామములో దురాత్మ శక్తులను గద్దించినప్పుడు అవి వారిని విడిచిపెట్టి వెళ్ళు చుండెను. చీకటి శక్తులు పారిపోవు చుండెను. యేసునామము అన్ని నామములకంటె పైనామము. ఆ నామమును రోగుల మీద ఉచ్చరించినప్పుడు స్వస్థత కలుగుచుండెను. దయ్యముల మీద ఉచ్చరించినప్పుడు అవి పారిపోవుచుండెను. పరిశుద్ధాత్మ దేవుడు బ్రదర్ ఎబినెజరుగారిని తన స్వాధీనమందుంచుకొని అనేకమైన అద్భుతకార్యములను జరిగించెను.

ఒక పర్యాయము ఎబినెజరుగారి సువార్త కూడికలు జరుగుచుండగా అనేకమంది పాల్గొనిరి. వారిలో క్షుద్రమంత్ర గాళ్ళు, జ్యోతిష్కులు, వేదపండితులు పాల్గొనిరి. వారందరు కూడబలుక్కొని ఎబినెజరుగారికి వ్యతిరేకముగా ఆ సువార్త కూడికను ఆటంకపరచనుద్దేశము కలిగి యుండిరి. అప్పుడు బ్రదర్ ఆత్మపూర్ణుడై ధ్యానము ద్వారా మత్తయి 18:18ని బట్టి యేసునామములో ఆటంకపరచే అన్ని దురాత్మ శక్తులను బంధించివేసెను. అప్పుడు పరిశుద్ధాత్మ శక్తి ఆ ప్రాంగణము మీదికి వచ్చి ఆటంకపరచే శక్తులను, వ్యక్తులను మూగవారిగా బంధించెను. మీరు అపాయకరమైన సాతాను బంధకములలో యున్నారని వారికి బోధించెను. సువార్త వినిన వారందరును తమ పాపములను ఒప్పుకొని యేసుప్రభువును రక్షకునిగా అంగీకరించిరి. పరిశుద్ధాత్మ దేవుడు ఆ సాతాను శక్తులను బంధించి వారందరికిని విడుదల, రక్షణ అనుగ్రహించెను.

అప్పుడు ఎబినెజరుగారు వారిలో ప్రతి ఒక్కరితోను మాట్లాడి మరణము, రెండవ మరణమును గురించి, నరక మును గురించి, ఆరని అగ్నిని గురించి వారికి చెప్పినప్పుడు వారందరు యేసును రక్షకునిగా అంగీరించిరి. తమ పాపము లను ఒప్పుకొని అందరును యేసునామములో బాప్తిస్మము పొందిరి. అప్పుడు వారు తమ పాత జీవితములో చేసినటువంటి క్షుద్రశక్తుల పూజలు మానివేసిరి.

ఈలాటి కార్యములను చూచిన ప్రజలందరును విస్మయ మొంది దేవుని నామ ఘనతను కొనియాడిరి. యేసునామ ఘనతను ఎరిగిన తరువాత వారందరు దేవుని కొనియాడుచూ ఏకముగా హల్లెలూయ, హల్లెలూయ అని చెప్పసాగిరి. చప్పట్లు కొడుతూ, చేతులు రెండు పైకెత్తి ఊపుతూ దేవుని ఘనపరచిరి. ఈ గొప్ప సంచలన వార్త దావానలంగా ఆ ప్రాంతమంతా వ్యాపించినప్పుడు జనులు గుంపులు గుంపులుగా మీటింగ్స్‌కు వచ్చిరి. కూటములలో జనము రెట్టింపైరి. ఐదు రోజులుగా ఏర్పాటు చేయబడిన కూటములు జనుల యొక్క ఆసక్తితో ఏకంగా 11 రోజులు సాగినది. ఈ కూటములలో ఏ మాత్రము ఖాళీ సమయము దొరకక అవిశ్రాంతముగా కార్యభారమును జరిగించెను. దేవుడు అద్భుతముగా మహిమపరచబడెను.

ఈ మధ్యకాలంలో డా॥ బి. సుదర్శనము అనే వ్యక్తి నిజామాబాద్ జిల్లా యల్లారెడ్డి తాలుకాలోని తాండూరు అనే

గ్రామములో సువార్త సేవా కూటములు జరిగించునట్లు ప్రార్థనా పూర్వకంగా ఏర్పాట్లు చేసిరి. దేవుడు మన సహో. ఎబినెజరుగారిని అద్భుతముగా వాడుకొని ఆయన నామము నకు ఘనత వచ్చునట్లుగా అనేక అద్భుతములను జరిగించెను.

ఆ గ్రామములో డా॥ సుదర్శనముగారి కుటుంబమును పాడుచేయుటకు కొందరు మంత్రశక్తులను, సాతానీయ శక్తులను ఆ కుటుంబము మీద ప్రయోగించి వారిని నాశనము చేయ ప్రయత్నించిరి. ఆ ప్రక్రియలో అనేకమైన కప్పలు, పాములు ఆ యింటిలోకి వచ్చునట్లు చేసిరి. అవి వంటగది లోను, బెడ్‌రూములోను చేరి వారిని ఇబ్బంది పెట్టుచు బహుగా బాధించుచుండెను. వాటి నుండి విడుదల పొందుటకు ఆ కుటుంబము ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేదు. అప్పుడు వారు ఎబినెజరుగారి దగ్గరకు వచ్చి పరిస్థితి విన్నవించుకోగా ఆ దైవజనుడు ప్రార్థించి సాతాను శక్తులను యేసు నామములో బంధించెను. అప్పుడు వారికి వాటినుండి విడుదల కలిగెను. మొదటగా ఆ ఊరిలో వారంరోజులుగా ఏర్పాటు చేసిన కూటములు నెల రోజుల వరకు జరిగెను మరియు ఇంకొక వారము అనగా మొత్తం 37 రోజులు జరిగినవి. ఈ 37 రోజుల కూటములలో దేవుడు బ్రదర్‌ని అద్భుతముగా వాడుకొని అనేకమైన కుదరని జబ్బులను సహితము యేసునామములో బాగుచేసెను.

ఒకానొక రోజున ఆయన యొద్దకు అపవిత్రాత్మ పట్టిన ఒక స్త్రీ తీసికొని రాబడినది. బ్రదర్ ఆమె మీద చేతులుంచి ఆమె విడుదలకు ప్రార్థన చేయగా ఆ దయ్యము ఆమెను విడిచిపెట్టి వెళ్ళుటకు ఇష్టపడక పోవుచుండెను. అది ఒక మాంత్రికుని శక్తిచేత పంపబడిన దయ్యమట. సహోదరుడు ఆమెమీద చేతులుంచి ప్రార్థించినపుడు కరెంటు షాకు తలిగినట్టుగా ఆమె నేలకు పడిపోయెను. నేలమీద పడిన తరువాత తన ఒంటిమీద ఉన్న బట్టలను చింపివేసుకొనుట వలన ఆమె దాదాపుగా దిగంబరస్థితికి జారిపోవుచుండెను. అట్టి తరుణములో అక్కడ వున్నటువంటి వారు ఒక పెద్ద దుప్పటి తెచ్చి ఆమెకు కప్పిరి. దానిని కూడ చింపి ముక్కలు చేసెను. అందువలన ఒక గొంగళి తెచ్చి ఆమెకు బలవంతంగా చుట్టిరి. ఆమె ఎబినెజరుగారికి దూరంగా పారిపోవలెనని ప్రయత్నము చేస్తుండగా బలవంతంగా ఆపబడినది. సహోదరుడు ఆమె మీద చేతులుంచి ప్రార్థించగా అది పోలేదు. మరలా మరలా రెండుగంటల పాటు ప్రార్థించిన తరువాత ఆ స్త్రీని విలవిలలాడించుచు పడి దొర్లుచుండెను. అప్పుడు ఆమెను విడిచి వెళ్ళెను.

అక్కడ చేయబడిన ఈ అద్భుత కార్యములను బట్టి ప్రచారము జరుగగా అనేకమంది జబ్బులతోను, మొండి వ్యాధులతోను, చేతబడి, బాణామతి శక్తులచేతను పీడింపబడువారిని, కుల, వర్ణ, మత ప్రసక్తిలేకుండా అందరి కొరకు ప్రార్థించి విడుదల పొందుకొనులాగా యేసు నామము మహిమపరచబడెను. క్షుద్రశక్తులను ఆశ్రయించి పూజించే తాంత్రిక విద్యనభ్యసించినటువంటి మాంత్రికులు తమ విరోధమైన కుటుంబాలపైన ఈ విద్యను ప్రదర్శించి వారికి నష్టము వాటిల్ల చేయవలయునని ప్రయత్నించినపుడు వారి ఆటలు సాగకుండ నిరోధించబడినవి. ఎందుకనగా దేవుని మహాశక్తి ముందు క్షుద్రదేవతలకు తీరని అవమానము కలిగినందున ఏ హాని కూడ దేవుని బిడ్డలకు జరుగలేదు. ఒకసారి ఒక మాంత్రికుడు తన క్షుద్రదేవత పేరు మీద ఒక పామును బ్రదర్ ఇంట్లోకి పంపాడు. ఇది నాగదేవత అనే త్రాచుపాము.

(సశేషం)

## ఎస్.యం.ఎస్. పరిచర్య



**ఎవరికైనా ప్రతిరోజు దేవుని వాక్యము ఉచితంగా పొందగోరినచో లేదా మీ ప్రియులకు పంపగోరినచో 9908822365 నెంబరును సంప్రదించగలరు.**

ప్రతిరోజు 'హన్నాకృప' పాఠకులకు, శ్రేయోభి లాషులకు, మిత్రులకు దేవుని వాక్యము SMS చేయుటకు ప్రియులు **ఎ.యన్.ఆర్.జక్కంగారు** ప్రతినెల రూ.1000/- అందించుచున్నారు. వారికి వందనములు. ఈ పరిచర్య ద్వారా ఎంతోమంది ఆత్మీయ మేలులు పొందుచున్నందుకు దేవునికి స్తోత్రములు చెల్లించుచున్నాము.



# మహా యజ్ఞమ్



**పుణ్యదాన బలియాగం**

తాండియ మహా బ్రాహ్మణం (సామవేదం) –

| | | |
|---|---|---|
| సర్వపాప | = | అన్ని విధాలైన పాపాలను |
| పరిహారో | = | పోగొట్టడానికి |
| రక్తప్రోక్షణం | = | రక్తాన్ని సమర్పించటం |
| అవశ్యం | = | అత్యవసరమై వుంది |
| తద్రక్తం | = | ఆ రక్తం |
| పరమాత్మేన | = | భగవంతునిదై వుండాలి. |

అనాదిగా మానవులందరూ తమ పాప ప్రాయశ్చిత్తార్థంగా యజ్ఞాది బలియాగాలెన్నెన్నో చేస్తూ వున్నారు. ఈ యజ్ఞాలన్నీ ఒక మహాయజ్ఞానికి ఛాయలు మాత్రమే.

**'ఆత్మదా బలదాః యస్య**
**ఛాయమృతం యస మృత్యుః'**

గాయత్రి మంత్రంలో, భగవద్ లక్షణాలు అభివర్ణించబడి ఉన్నాయి. శ్లోకం గమనించండి.

**'ఓం బూర్భువం / స్వః తత్సవితు ర్వ రేణ్యమ్**
**భర్గో దేవస్య ధీ మహి / ధియో, యోనః ప్రబోదయాత్'**

(ఋగ్వేదం 3-62:10), యజుర్వేదం 36-3, సామవేదం 3-26-10).

**తాత్పర్యం :** ఓ దయామయ దైవమా! స్వయం సంభవుడవై, సర్వదా సజీవుడవై సుఖ సంతోషధాముడవై మహోజ్వల తేజస్వివై పాపపరిహారార్థమైన ప్రకాంతివై రాజిల్లు, నీ దివ్వ నామాన్ని ధ్యానింతుమయ్యా :

ఈ శ్లోకంలో గాయత్రీ మంత్రోపయుక్తం. దేశీయమైన ముక్కోటి దేవతల్లో ఒక్కనామం కూడ ప్రస్తావింపబడలేదు. ఐతే 'ఓ దివ్య నామాన్ని ధ్యానింతుము' అని వుంది. ఆ దివ్య నామమేదో, ఆ పరమాత్ముని గుణగణాలేవో పరిశీలిద్దాం. స్వయం సంభవుడైన పరంధాముని గూర్చిన సాక్ష్యాధారం బైబిల్ గ్రంథంలో ఉంది.

ఇశ్రాయేలు జనాంగానికి ఒక ధర్మశాస్త్రంఉంది. ఆ ధర్మశాస్త్రానుగుణంగా, బైబిల్‌లోని సనాతన ఒడంబడిక అంటే 'పాతనిబంధన గ్రంథం' రూపొందింది. క్రీస్తు జననానికి కొన్ని వందల ఏండ్ల క్రితం 'యెషయా' అనే గొప్ప ప్రవక్త జీవించాడు. ఆయన తన గ్రంథంలో 'ఆలకించండి, ఆది దేవుడు ఆయనే కుమారుడై భువనంలో ఉదయిస్తాడు' అనే సూచనను చూపించాడు. కన్యక గర్భవతియై, ఒక కుమారుని కని ఆయనకు **'ఇమ్మానుయేలు'** అను నామకరణం చేస్తుంది (బైబిల్ – యెషయా 7:14) **(ఇమ్మానుయేలు అంటే 'దైవం మనకు తోడైవుంటాడు'** అని అర్థం. ఆ యెషయా ప్రవక్త (యెషయా 53:4,5,12) భాగంలో ఇలా ప్రవచించారు. ఆ కుమారుడు మన రోగాలను భరిస్తాడు. మన అతిక్రమాలు అనే గాయాలను ఆయన పొందుతాడు. మనకు సమాధానం చేకూర్చేందుకు ఆయన శిక్షననుభవిస్తాడు. మనం బ్రతకాలని ఆయన మరణించి పునరుత్థానుడౌతాడు. కాబట్టి ఇమ్మానుయేలు (యేసు) నామధేయంతో పిలుబడినాడు, దైవాంశ సంభూతుడు, స్వయం సంభవ కుమారుడు "బూర్భువం స్వః తత్సవితుర్వరేణ్యం" శ్లోకంలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాడు. ఈ కుమారుని గుణాలన్నీ శ్లోకంలో అభివర్ణింపబడినాయి. భగవంతుడే కుమారుడై ఉన్నాడని విన్నాము. ఈ కుమారుడు, ఆ పరాత్పరునికీ కుమారుడే. ఆయన అవతరించిన భువన జనాళికకీ కుమారుడే. కుమారుని కర్తవ్యం, తండ్రి ఆజ్ఞను నెఱవేర్చుతూ, పుడమి ప్రజాళిని పున్నామ నరక ప్రాప్తి నుండి తప్పించి, పితృ సముఖానికి చేర్పించడం. అందుకే **'అపుత్ర స్య గతిర్నాస్తి స్వర్గోనైతి వచనె వచః'** అనే వేదమంత్రం ఏనాడో విరచితమైంది. (బృహదా రణం ఉపనిషత్).

అపుత్రస్య = పుత్రలేమి వలన
గతిః + నాస్తి = మార్గం లభించదు.
స్వర్గం + ఉనః + ఐతిః = స్వర్గం చేరలేము
వచనః + ఐః + నః + వచః = ప్రాజ్ఞవచనం

**తాత్పర్యం :** కుమార లేమి వలన మార్గం అలభ్యం. తత్కారణంగా, స్వర్గం చేరలేము. ఇది ప్రాజ్ఞుల వచనం –

పవిత్ర బైబిల్ గ్రంథంలో ప్రవచనం ఇలా ఉంది **'ప్రపూర్ణ ప్రేమతో కుమారుని ముద్దాడండి. అలా చేయని వారు త్రోవ తప్పి నశించగలరు. కుమారుని ఆశ్రయించు వారందరూ ధన్యులే'.**

బైబిల్ – కీర్తన 2:12

క్రీస్తు జననానికి, వెయ్యేళ్ళ క్రితం ఈ దివ్య సూక్తి వ్రాయబడింది. 'కుమార' శబ్దార్థం చూద్దాం.

కుమారః = కుమారుడు (కు+మారః)

కు = చెడుగు (పాపము)

మారః = పరిమార్చు / పరిహరించు

కుమారః = పాపాన్ని పరిహరించేవాడు.

చతుర్వేదాది ఉపనిషత్తులు, బైబిల్ వేద ఆధ్యాత్మిక ఉద్గ్రంథాలన్నీ కుమార సంభవం, కుమార మహాయజ్ఞ ప్రాభవం గురించి ఘంటాపథంగా ప్రస్తావించే ప్రధాన సత్యం **'కుమారుడే మోక్షమార్గం, కుమారుడే మోక్షానందం, కుమారుడే మోక్షరాజ్య జీవం, కుమారుడే మోక్షప్రదాత'** అని ఏకకంఠంగా ఉద్ఘాటిస్తున్నాయి.

మనమీ సత్యాధారంగా మరికొన్ని నిజాలను జాగ్రత్తగా పరిశీలించాలి. మన కుమారులు తమ ప్రవర్తన ద్వారా మన దోషాలను నిర్మూలించి కైలాస సంప్రాప్తిని మనకు కలిగించ గలుగుతున్నారా? మన కుమారుల్లోనే కొందరు త్రాగుడు, జూదం, అబద్ధం, వ్యభిచారాది అవలక్షణాల్లో మునిగి తేలుతున్నారు. వీరు మనకు మోక్ష ప్రదాతలౌతారా? వీరికి ప్రత్యక్ష సాక్షులమైన మనం కూడా దోష భూయిష్టులమే. పాపం మనం చేసినా, మన పిల్లలు చేసినా, ఇరుగు పొరుగు ఇతరులెవరు చేసినా, అందరం పాపకూపంలో ఈదులాడు తున్నామని తెలుస్తుంది. మనుష్యులందరూ పాపభూయిష్టులే. ఐతే మానవుడై పాపంలేని వాడెవడు? **మానవుడై పాపరహితుడు యేసుప్రభువు ఒక్కడే.** భక్తి ప్రపత్తులతో బైబిల్‌ను పఠించే వారికి ఈ సత్యం బయల్పడుతుంది. అంతేకాదు **'నాలో పాపమున్నదని ఎవరు నిరూపించగలరు?'** అని ప్రభువడిగిన వాక్యం కూడ చూడగలరు. 'ఈయనలో ఏ పాపమూ నాకు కనబడుట లేదే' అని అనేకుల యెదుట, అధిపతి పిలాతు వచించడం కూడా కనబడుతుంది. **'యేసు పాపరహితుడు'** ఈ సత్యం నిర్వివాదాంశం. దైవకుమారుడు పరమ పవిత్రుడు. **యేసుప్రభువు సర్వ మానవాళిని మోక్షానికి నడిపించు కర్త. వేదాలు వెల్లడించిన కుమారుడు యేసే.**

పుత్రుడు లేదా కుమారుడు కన్యకకు జన్మించాలి అని ప్రవచనం ఉంది. గాయత్రి మంత్రంలో పుత్రుని లేదా దేవుని గుణగణాలు, కన్యకకు కలిగే పుత్రునిలో ఉంటాయి. పవిత్రాత్మ ప్రభావంచేత గర్భధారిణియైన కన్యకకు కలిగే కుమారునికే దైవ గుణగణాలు సంక్రమిస్తాయి. పవిత్రాత్మ అంటే పరాత్పరుని ఆత్మ. అంటే సాక్షాత్తు పరమాత్ముడే మానవ పుత్రావతారం ధరిస్తాడు. **దేవుడే మానవ పుత్రుడైనందున ఆయన దైవకుమారుడు. మనుష్యుల మధ్య కుమారుడుగా ఉదయించాడు గనుక మనుష్యకుమారుడు అనే నామాంతరాలు ఏర్పడ్డాయి.**

పవిత్ర బైబిల్ గ్రంథంలోని నూతన నిబంధన విభాగంలో, మత్తయి, మార్కు సువార్తల్లో కుమారుడైన యేసుక్రీస్తు జనన వివరం తెలుసుకోవచ్చు. లూకా 1:30-38 ప్రకారం 'గాబ్రియేల్' అను ఒక దేవదూత మరియకు ప్రత్యక్షమయ్యాడు. 'మరియా! సోదరీ, భయపడకు, దైవ సముఖం నుండి వచ్చిన దేవదూతను నేను. నా పేరు గాబ్రియేలు నీవు దేవుని దయాప్రాప్తురాలవు, పవిత్రాత్మ ప్రభావం చేత నీవు గర్భం ధరించి కుమారుని కని, ఆయనకు 'యేసు' అను నామకరణం చేస్తావు. ఉద్భవమైన కుమారుడు పరమ పవిత్రుడై దేవుని కుమారుడనబడును. ఇది దైవాదేశం నెరవేరి తీరుతుంది. నీవు నిస్సందేహంగా, నిబ్బరంగా దైవపుత్రుని మాతృమూర్తి ధర్మాన్ని కొనసాగింతువుగాక!!' అని వెల్లడించాడు. అంతట మరియ 'ప్రభువా నేను నీ ఆజ్ఞను శిరసావహిస్తాను. నీ మాట చొప్పున నాకు జరుగును గాక'! అని వందన సమర్పణ చేసింది. ఈ దైవ ప్రణాళికానుగుణంగా కన్యకయందు ఉదయించిన పుత్రుడే దేవుని కుమారుడు యేసుక్రీస్తు. ఈయన, పాపము యొక్క తీవ్రతను తగ్గించి, దుష్టాత్ములకు తరుణోపాయం సంస్థాపించి, దుష్టరక్షణ నవ మార్గాన్ని నెలకొల్పాడు. పరలోక పాలకుడైన ఆది దేవుడు ఒక లోక రక్షకుడుగా ఉద్భవించడానికి పవిత్ర కన్యకను మాతృమూర్తిగా పరిగ్రహించాడు.

నరకాత్రాయిత ఇతి పుత్రః

(నరక+అత్+త్రాయిత+ఇతి+పుత్రః)

పుత్రః = పుత్రుడు

నరక = నరకము

అత్రాయిత = నుండి, తప్పించువాడు.

తాత్పర్యం : పుత్రుడైన (కుమారుడు) పిత్రాదులను, నరక ప్రాప్తి నుండి తప్పించును. ఇది లోకయుక్త సామాన్య ధర్మం. ఈ ధర్మానుసారం జన్మించిన వాడే దేవుని కుమారుడు. ఆయనే యేసుప్రభువు.

యేసు దేవుని కుమారుడని, పరమ పవిత్రుడని ఆధారాలు

**1. దేవుని సాక్ష్యం :** మత్తయి సువార్త 3:17, మార్కు 9:7, లూకా 9:35 భాగాల్లో దివ్యవాణి పలుకులివి! 'ఈయన (యేసు) నా ప్రియకుమారుడు. ఈయనయందు నేను ఆనందించుచున్నాను. సకలలోక జనావళి ఈయన మాటను వినాలి'.

(సశేషం)

# మదర్ తెరీసా

4

మదర్ తెరీసా తన పేరును ఆ రోజుల్లో ఎంతో ప్రసిద్ధమైన సెంట్ తెరీస్సా ఆఫ్ ఆవీలా నుండి కాదుగాని చిన్నమొగ్గ అయిన సెంట్ తెరిసా ఆప్ లిసిఎక్స్ నుండి తీసుకుంది. ఆమె నిర్ణయంలోని నిరాడంబరము, తగ్గించుకొనే గుణము కనిపిస్తుంది. వారు మనసులో ముద్రవేసుకొనిన సెయింట్ పేరును వారు పెట్టుకోవచ్చు. అగ్నెస్‌ను బహుగా ఉత్తేజపరచిన లిసీయ నగరవాసి థెరిస్సాను (1873-97) సెయింట్‌గా 1925 పోప్ ప్రకటించారు. ఆమె 24 సంవత్సరాల వయస్సులోనే టి.బి. వ్యాధితో చనిపోయినది. 15 సంవత్సరాల వయసులో పోప్‌గారి అనుమతితో సిస్టర్‌గా చేరి, "ప్రేమ నా జీవితాశయం. అదే నా సేవకు పిలుపు. నేను చేసే ప్రతి పనిలోను ప్రేమ కనిపించాలి" అన్న సెయింట్ థెరిస్సా జీవిత చరిత్ర అగ్నెస్‌కు ఎంతో సంతోషాన్ని, నూతనోత్తేజాన్ని నింపాయి. అప్పటికే ఒకరు సెయింట్ థెరీస్సా పేరు పెట్టుకున్నందున అగ్నెస్ స్పానిష్ స్పెల్లింగ్‌తో వున్న 'తెరిసా' పేరు పెట్టుకుంది. బెటికా పేరును సిస్టర్ మేరీ మగ్దలేనెగా పెట్టుకుంది.

అగ్నెస్ అలియాస్ సిస్టర్ తెరీసా తన మొట్టమొదటి వాగ్దానముతో తన మఠ జీవితాన్ని ప్రారంభించింది. యెషయా 54:5 'నిన్ను సృష్టించిన వాడు నీకు భర్తయై యున్నాడు'. ఆమె దేవునికి పెండ్లికియ్యబడినది. ఆయనకు సంపూర్తిగా, నిస్వార్థంగా సేవ చేయుటకు కేటాయించబడినది. ఆ నేపథ్యం లోనే ఆమె పేరును సిస్టర్ తెరీసాగా ఎంచుకుంది. రెండు సంవత్సరాల పాటు వీరికి శిక్షణ ఇవ్వబడింది. మొదటి సంవత్సరం బైబిలు చదవటానికి, దైవిక కార్యాల్ని నెరవేర్చుటకు అనేకమైన వాక్యాలు, కీర్తనలు, దేవునికి జీవితాలను అర్పించిన వారి ధీరగాథలు అన్నీ నేర్పిస్తారు. రెండవ సంవత్సరం సెయింట్ ఇగ్నీషియాస్ లయోలాగారు ప్రబోధించిన ఆధ్యాత్మిక అభ్యాసాలు నాలుగు అంచెలుగా నేర్పబడుతుంది. ప్రతి ఒక్కరు తమ జీవిత పాపాన్ని పూర్తిగా ఒప్పుకొనుట. రెండవ దశలో ప్రతి ఒక్కరు వారి పూర్ణ హృదయముతో మనసుతో క్రీకస్తు ప్రభువు ఈ లోకములో గొప్ప శక్తిమంతుడై పునరుత్థాన శక్తితో వున్నాడని విశ్వసించుట, మూడవదిగా ప్రతి ఒక్కరు క్రీస్తు ప్రభువుతో జతపనివారిగా మార్చబడినారనే నిశ్చయత కలిగి వుండటం. చివరిగా క్రీస్తు ప్రభువుతో కలిసి చేసిన పనికి బహుమానాన్ని పొందుకోవడము తోటిపనివారి ప్రేమను చూరగొనడం. అంటే ప్రతి విషయములోనూ అన్నింటిలోను దేవుని కనుగొనుట. ఆత్మీయత ఆరాధనగా మారి ఆచరణలోకి రావాలి. ప్రార్థించుట, సేవచేయుట, ప్రతిపాదించుట, సఫలీ కృతము చేయుట. ప్రతిరోజూ వారి విశ్వాసాన్ని పరీక్షించు కొనుట. సంవత్సరానికొసారి ఆత్మీయస్థితిలో స్థిర పడడానికి సంవత్సరాంత రిట్రీటుకి వెళ్ళేవారు.

★ మదర్ థెరిసా పేరును 'మదర్ తెరీసా'గా పాఠకులు గుర్తించగలరు.

సిస్టర్ తెరీసా స్కూలు పిల్లలకు పాఠాలు చెప్పడం మొదలుపెట్టింది. నర్సులకు సహాయకారిగా కూడ ఉండటం మొదలుపెట్టింది. ఆ రోజుల్లో బ్రిటీషు తెల్లదొరలు ఇండియా దేశస్థుల్ని ఎంత చిన్నచూపు చూసేవారో ఆమె అర్థం చేసుకుంది. ఒకసారి సిస్టర్ తెరీసా ఒక సంభాషణ విన్నది. ఒక భారతీయుడు ఇంకొకనితో 'నీవు బ్రిటీషు రాజును ద్వేషిస్తావా లేక వడ్డీ వ్యాపారస్తుడిని ద్వేషిస్తావా?' అని అడిగినప్పుడు 'బ్రిటీష్ రాజునే' అని ఠక్కున చెప్పి ఎందుకో వివరణ కూడా ఇస్తూ 'వడ్డీ వ్యాపారస్తుడు తన డబ్బు తిరిగి వచ్చేంత వరకు నేను బ్రతికి వుండాలని కోరుకుంటాడు. కాని ఈ బ్రిటీష్‌రాజు నేను చచ్చినా బ్రతికినా పట్టించుకోడు' అని చెప్పాడు.

డార్జిలింగ్‌లోని ప్రశాంత వాతావరణంలో రెండేళ్ళు శిక్షణ పూర్తి చేసిన తరువాత 1931 మే నెల 24న సిస్టర్ తెరీసా తన పేదరికం, పరిశుద్ధత, విధేయత పట్ల ప్రథమ వాగ్దానాలు చేసింది పేదరికమనే వాగ్దానంలో నాకున్న సర్వస్వాన్ని వది లేస్తున్నానని మోకరించి చెప్పింది. అలాగే తన పరిశుద్ధత గురించి వాగ్దానం చేస్తూ, తన హృదయంలో దేవునికి తప్ప మరెవరికీ స్థానం లేదని వాగ్దానం చేసింది. ఎందుకంటే ఆమె శరీరం దేవునికి ఆలయమై ఉన్నది. ఆ శరీరంతో ఎల్లవేళలా తను తన దేవునికి పరిచర్య చేయగలగాలి. మూడవదిగా తన విధేయత వాగ్దానం గురించి, తన చిత్తమేమి లేదు ప్రభువు చిత్తమే జరగాలని వాగ్దానం చేసింది. ఈ మూడు వాగ్దానాలలో తన శరీరము, మనసు, ఆత్మ దేవునికే అర్పితమైనాయి. ఆమె దేవుని సొత్తు, పెండ్లికియ్యబడిన వధువు. రైలులో ప్రయాణిస్తూ డార్జిలింగ్‌కు శెలవు చెప్పి కలకత్తా చేరింది. పది అడుగుల

ఎత్తైన ప్రహరీ గోడ వున్న ప్రాంగణము. అదే లొరిటో ఎంటల్లీ. రెండు ఉన్నత పాఠశాలలున్న లొరిటో భవనాలు ఒక స్కూలులో 500 మంది అందరు ఉన్నతమైన కుటుంబాల నుండి వచ్చిన వారు మరో స్కూలు పిల్లలు మధ్య తరగతి నుండి పైసాలేని అనాధ పిల్లల వరకు ఉండే ఈ స్కూలులోనే సిస్టర్ తెరీసా జాగ్రఫీ, హిస్టరీ బోధించుట మొదలుపెట్టింది. ఆమె చరిత్ర పాఠాలలో ఇండియాలో క్రిస్టియన్ మత చరిత్ర అనేది ఒక భాగము. సెయింట్ థామస్ ఇండియా దేశమునకు క్రీస్తు ప్రభువు పునరుత్థానము తరువాత వచ్చి చైనా వరకు వెళ్ళి తిరిగి ఇండియా దేశంలో హతసాక్షిగా చంపబడి మైలాపూర్‌లో భూస్థాపితం చేయబడినట్లు చరిత్ర చెప్పుచున్నది. 6వ శతాబ్ధంలో సిరియా క్రిస్టియన్లు కేరళ రాష్ట్రానికి వచ్చినట్లు చరిత్ర చెబుతుంది. పోర్చుగల్ దేశస్థుడైన సెయింట్ జేవియర్ 1542 సంవత్సరంలో గోవా వచ్చినట్లు ఖచ్చితంగా తెలుస్తుంది. ప్రొటెస్టంట్లు తరువాత 16వ శతాబ్ధములో బెంగాల్ వచ్చినట్లు వారు బెంగాల్ రాష్ట్రంలో స్థిరపడినట్లు ఆధారాలున్నాయి. విలియమ్‌కేరి కష్టపడి బైబిల్ గ్రంథాన్ని ఇండియాలోని అనేక భాషలలోకి అనువదించినట్లు చరిత్ర చెప్తుంది. 18వ శాతాబ్ధం మధ్యలో మిషనరీ సేవ ఎంతో అభివృద్ధి చెందినట్లు చెప్పగలం. అదేవిధంగా 1841 ఆగష్టు 22న లొరిటో సంస్థవారు కలకత్తాలో తమ సేవ చేయుట ఆరంభించారు. అదే సంస్థలో ఆగ్నెస్ చేరి సిస్టర్ తెరీసాగా పనిచేస్తుంది. ఎంత అద్భుతము. ప్రభువు రాజ్య వ్యాప్తి తన శిష్యులకు చెప్పినట్లు సర్వలోకము నకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుట మొదలయ్యి వేగమంతమగుచున్నట్లు సిస్టర్ తెరీసా అనుకుంది. 1842 జనవరి 10వ తేదీన లొరిటో సంస్థ స్కూలు, అనాధ శరణా లయం ప్రారంభించారు. వీరి సంస్థలో విద్యనభ్యసించుట ఆనాటి భారతీయులకు అభీష్టమై యున్నది. మొదటి 20 సం॥లలో 42 మంది సిస్టర్లు చనిపోయారు. అయినను విదేశాల నుండి సిస్టర్లు సేవ చేయడానికి వస్తూనే వున్నారు. సిస్టర్ తెరీసా కూడా అదేక్రమంలో వుంది. దేవుని ప్రేమతో ఎంతటి కష్టాన్నైనా అధిగమించేవారు.

సంవత్సరానికోసారి వారి వాగ్ధానంలో స్థిరపడడానికి సంవత్సరాంతపు రిట్రీటులో గడిపేవారు. 1932లో సిస్టర్ తెరీసాకు అల్బేనియా నుండి ఉత్తరం వచ్చింది. ఆమె అక్క అగాతాకి ఉద్యోగం వచ్చి లాజరు దగ్గర వుంటున్నట్లు వ్రాశారు. తల్లి ఒక్కతే స్కోపిజే నగరంలో వున్నట్లు తెలిపారు. లాజరు, అగాతా తమ తల్లికి ఎన్నోసార్లు తమ దగ్గరకు రమ్మంటే ఆమె నిరాకరించిందని తెలుసుకుని సిస్టర్ తెరీసా చాలా బాధపడింది. కాని తన తల్లి ఏనాడు ఎటువంటి విషయంలోను ఫిర్యాదు చేయలేదు గదా ఆగ్నేస్ తన విశ్వాసాన్ని కాపాడుకుంటూ ప్రభువు సేవలో కొనసాగుచున్నందుకు ఎంతో సంతోషిస్తున్నట్లు వ్రాసేవారు. 1932లో భారత స్వాతంత్ర్య ఉద్యమం ఊపందు కుంది. గాంధీ నాయకత్వంలో వేలకు వేలమంది ప్రజలు పాల్గొని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళారు. కాని సిస్టర్ తెరీసా గాంధీగారి ఆలోచనలో ఒకటి నచ్చలేదు. అదేమంటే కులవ్యవస్థను గాంధీగారు సమర్ధించుట. ఆయన సమర్ధించిన కారణమేమంటే కులవ్యవస్థ లేకుంటే భారత సాంప్రదాయం దెబ్బతింటుందని. కొండమీద ప్రసంగం గాంధీగారికి కొట్టినపిండి. ఈ విషయంలో సిస్టర్ తెరీసా గాంధీగారిని మెచ్చుకునేది.

అదే సమయంలో జర్మనీలోని నాజీ పార్టీ అడాల్ఫ్ హిట్లర్ నాయకత్వంలో వెళ్ళూనుకుంటున్నది. ఇటలీలో మరో హిట్లర్ అయిన ముస్సోలినీ నాయకత్వంలో సమాజ పతనానికి నాంది కానుంది. హిట్లర్‌తో ముస్సోలినీ చేతులు కలిపాడు. ఇలాంటి ప్రపంచ పరిస్థితులలో సిస్టర్ తెరీసా తనకు ప్రభువు అప్పగించిన పని చేసుకుంటూ వెళ్తున్నది. బెంగాలీ భాష నేర్చుకుంది. ఇప్పుడు ఆమెకు అయిదు భాషలు వచ్చును. ఆల్బేనియన్, సెర్బోక్రోయేషియన్, లాటిన్, ఇంగ్లీషు మరియు బెంగాలి.

1935లో సిస్టర్ తెరీసాకు 25 సంవత్సరాల వయస్సు. ఆమె తన జీవితంలోని ప్రతి నిమిషం దేవుని సేవలోనే గడుపుతుంది. ప్రపంచంలోని ఏ పరిస్థితిలోను ఆమె చలించ లేదు. ఎందుకంటే ఆమె విశ్వాసం కాలగతులు ప్రభువు చేతుల్లో వున్నాయని, ఆయన ప్రణాళికను ఏ మానవుడూ తిరిగగొట్ట లేడని ఆమెకు తెలుసు. కనుకనే నిశ్చింతగా వుండేది. అలాగని ప్రపంచంలో జరిగినవన్నీ మెచ్చుకొనేది కాదు. అనేక విషయాలు అపవాది వలన జరుగుచున్నవని సిస్టర్ తెరీసా తెలుసుకుంది. చాలా వరకు సాతాను తంత్రాలు లోకంలో వున్నాయని తెలుసుకుంది. 1935లో ముస్సోలినీ ఇథియో పియా దేశాన్ని ఆక్రమించినప్పుడు ఆమె బాధపడింది. మరి ముఖ్యంగా కలకత్తాలోని నిరుపేదలు, అసహనంగా పడివున్న వృద్ధులు, దిక్కులేని వారి గురించి ఆమె హృదయంలో ఎంతో వేదన పడేది. దేవునికి ఆమె అభ్యర్ధన ఏమంటే ఈ నిరుపేద, నిస్సహాయ ప్రజలకు సేవచేసే భాగ్యాన్ని, వారి జీవితాల్లో వెలుగునిచ్చే శక్తిని ప్రసాదించమని. (సశేషం)

పెద్ద కథ

# విశ్వాసంలో ఓ మెట్టు

31

20 సంవత్సరాల తర్వాత ఈ విశాలమైన పెరటివైపున రాత్రులు మంచం మీద పండుకొని క్రింద కాలుపెట్టాలంటే భయం వేసేది. ఒకరోజు ఉదయాన్నే ఇంటి ఓనరు కోడి చనిపోయింది. ఎలా చనిపోయిందని ఆలోచిస్తుంటే 'పాము కరిచిందేమో చూడండి' అన్నాడు సామ్యేలు. వాళ్ళు పరీక్షించి చూస్తే పాము కాటు కనిపించింది. అప్పుడు ఇంటి వారు ఆ పామును లోనికి రాకుండా కట్టుదిట్టం చేశారు. 'పాము వుందని మీకు ముందే తెలుసా?' అని అడిగింది ఇంటి ఓనరు. 'నేను ఇంట్లో చేరినప్పుడే తెలుసు' అన్నాడు సామ్యేలు. 'మరి మాకు చెప్పలేదే' అన్నారు. 'ఇల్లు కట్టుకొని స్థిరంగా వున్న మీకు నేను పామును చూపిస్తేనే కాని నమ్మరు, అలా కుదురు తుందా?' అన్నాడు. 'అయితే పాము వుందని తెలిసి ఎలా ఇక్కడే పండుకొనే వారు' అని అడిగింది. 'మా దేవునియందు భయభక్తులు గలవారి చుట్టూ ఆయన దూత కావలియుండి వారిని రక్షించును' అని చెప్పాడు. ఆమెకు అర్ధం కాలేదు.

ఒంగోలులో కాలేజీ చదివే రోజులలో సామ్యేలు క్లాస్‌మేట్ ఇనకొల్లు సత్యనారాయణరెడ్డి కనిగిరి నుండి ఒంగోలు వచ్చి రూము అద్దెకు తీసుకొని చదువుకొనే వాడు. దైవచింతనగల యోగ్యుడు. ఎటువంటి చెడు అలవాట్లు లేవు. మితభాషి. ప్రస్తుతం పంచాయితీరాజ్‌లో మంచి ఉద్యోగం చేస్తున్నాడు. సామ్యేలు కనిగిరి, పాతూరులో వున్న సత్యన్నారాయణరెడ్డి ఇంటికి వెళ్ళాడు. ఎంతో ఆప్యాయంగా పలకరించాడు. ఇంట్లోకి సరుకులు కావాలంటే ఒక అంగడికి తీసుకెళ్ళి పరిచయం చేశాడు. ఇప్పుడు సాయిబాబా భక్తునిగా అనేక కార్యక్రమాల్లో తలమునకలై వున్నాడు. 1962లో విడిపోయిన20 సం॥ల తర్వాత కలుసుకున్నప్పటికీ, స్నేహంలో వుండే మాధుర్యం సత్యన్నారా యణరెడ్డిలో ఫులిసిపోలేదు. హాస్పిటల్లోని స్టాఫంతా గౌరవంగా చూస్తున్నప్పటికీ సత్యన్నారాయణరెడ్డి హృదయంలో వున్న మంచితనం ఎక్కడ దొరుకుతుంది.

కంభంలో పనిచేసేటప్పుడు పంచాయితీలో పనిచేసే డ్రైవర్ కృష్ణ గిద్దలూరు వెళ్తూ ప్రమాదంలో చనిపోయినందున అతని శవాన్ని గిద్దలూరు ఆస్పత్రి నుండి బెస్తవారిపేటలోని ఇతని ఇంటికి చేర్చినందుకు క్రమశిక్షణ చర్య క్రింద కంభం నుండి కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రికి సామ్యేలును బదిలీ చేశారు. కంభంలో వుంటే నెలకి 200 రూపాయలైనా టి.ఎ. వచ్చేది. ఇప్పుడు కనిగిరిలో ప్రభుత్వ వాహనం లేనందున జీతంతో మాత్రమే సరిపుచ్చుకోవాలి. అదే సామ్యేలుకు శిక్షగా భావిం చారు సర్వీసు ఇంజనీరు. కాని దేవుడు నెలకు 35 డాలర్లు (522 రూపాయలు) పంపిస్తున్నాడు.

కనిగిరికి 23 కిలోమీటర్ల దూరంలో నాగిరెడ్డిపల్లెలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వుంది. ఆస్పత్రికి డా॥గురుబ్రహ్మం గారు వైద్యాధికారి. ఆస్పత్రికి యునిసెఫ్‌వారి కారు వుంది కాని డ్రైవరు లేదు. గురుబ్రహ్మంగారి భార్య సుగుణావతమ్మగారు కనిగిరిలో ప్రైవేటు ఆస్పత్రి నడిపిస్తున్నారు. గురుబ్రహ్మంగారు సామ్యేలును పిలిపించాడు. నాగిరెడ్డిపల్లెలో వున్న బండికి డ్రైవరుగా డిప్యూటేషన్ వేయించినట్లుగా చెప్పారు. కాపురం కనిగిరిలోనే వుంది. డ్రైవర్‌గా సామ్యేలుకు నెలకు 250 దాకా అదనంగా ఆదాయం వచ్చేది.

ఒక నెల గడచిన తర్వాత కనిగిరి ఆస్పత్రిలో రక్తపరీక్ష చేసే వీరభద్రయ్యగారు పదిమంది స్టాఫ్‌తో రాత్రి ఎనిమిది గంటల సమయంలో సామ్యేలు దగ్గరకు వచ్చాడు. వీరభద్రయ్యగారిది గ్యారంటీ రంగు. ఆ గ్యారెంటీ రంగు ఎంత ఎక్కువగా వుంటుందో అంత దయార్ధ హృద యుడు, పరోపకారి, ఆయన హృదయంలోని మంచితనం, శరీర వర్చస్సు ఒకదానితో ఒకటి పోటీ పడుతుంటాయి.

కనిగిరి ఎన్.జి.ఓల ఎలక్షన్ ప్రారంభమైంది అర్జంటుగా కరపత్రికలు ప్రింటు చెయ్యాలని చెప్పాడు. నేతాజీ ప్రెస్‌కి వెళ్ళమని చెప్పాను. ఆయనకి 'చాల పనులు తీరుబడి లేకుండినవి, పనివారు ఎవరూ లేరు, కనుక మీ హాస్పిటల్ డ్రైవర్ సామ్యేలు రేపు నాకు ప్రెస్‌లో సహాయపడితేనే నేను మీకు కరపత్రికలను ఇవ్వగలను' అని అన్నాడు. సామ్యేలు డిగ్రీ హోల్డర్ అయిన డ్రైవరు, అమెరికా వెళ్ళి వచ్చిన వాడు అని మాత్రమే తెలిసిన స్టాఫ్ సామ్యేలుకు ప్రెస్ పనికి సంబంధమేమిటో అర్ధంకాలేదు. 'సామ్యేలుకు ప్రెస్ పని వచ్చా?' అని అడిగారు. 'అంతేకాదు, మంచి బైండర్ కూడా' అని చెప్పాడు రెడ్డిగారు. వెంటనే వారు సామ్యేలు ఇంటికి వచ్చి అడిగారు. ప్రెస్‌లో ఏమీ పనిలేదు అని సుబ్బారెడ్డిగారు చెప్పిన దానికి ఇప్పటి పరిస్థితికి సంబంధం ఏమీ కనిపించలేదు.

ఉదయాన్నే ప్రెస్‌లో ప్రవేశించాడు సామ్యేలు. ప్రెస్సు, ఇల్లు ఒకటే. రెడ్డిగారికి ముగ్గురు చిన్నపిల్లలు. ప్రెస్‌లో ఎక్కువ భాగం ఇల్లులాగే కనిపిస్తుంది. బయట నుండి చూస్తే అది కాపురముండే ఇల్లు అనుకుంటారే కాని వ్యాపార స్థలము అనుకోరు.

ప్రెస్ లోపల ఏదీ ఉండవలసిన పద్ధతిలో లేదు. ఏ రోజుకి ఆరోజు లాగానే ఉంది కాని కలకాలం ఉండే దానిలా లేదు. అలా వుంటే పనిచెయ్యటానికి మనసుకు సంతోషం కలుగదు. ఆరోజు సాయంకాలం ప్రెస్ నుండి ఇంటికి వచ్చినా, ప్రెస్ తన వెంట వచ్చిందని తెలుసు సామ్యేలుకు. అంతా సర్దితే చాలా విశాలమైన ఇల్లు. తను కోరుకొనినదే తన వద్దకు వచ్చింది. హాస్పిటల్లో పని ఏమీ లేదు. రోజంతా చదువలేదు. రెడ్డిగారు డబ్బు ఇస్తాడా? ఇవ్వడా? అనే విషయం కాదుగాని ఆ ప్రెస్‌ని సర్దటానికి ఒప్పుకుంటాడా?

మరుసటి రోజు ప్రెస్‌కి వెళ్ళి ఒక మూల మొదలు పెట్టి మరో మూలకు సరిచేసేటప్పటికి సాయంకాలం అయింది. ఇంటికి వెళ్ళేటప్పుడు ఒకసారి తను చేసిన పనంతా చూసి తనలో తనే తృప్తిపడ్డాడు సామ్యేలు. 'వెళ్ళి వస్తానండి' అని అన్నాడు. రెడ్డిగారు చేతిలో కంపోజింగ్ స్టిక్ ప్రక్కన పెట్టి దగ్గరకు వస్తుంటే, ఇప్పుడు తనతో చాలాసేపు మాట్లాడ బోతున్నాడు అనుకున్నాడు సామ్యేలు. కాని ఒక చిరునవ్వు నవ్వి ఏదో అని మరో పనిలోకి వెళ్ళాడు. అంటే ఇక వెళ్ళు, మళ్ళీ రావద్దు అన్నట్లు అనిపించింది. మళ్ళీ రావద్దు అంటే చేసిన పనికి ఏదో ఒకటి ఇచ్చి పంపుతాడు కదా అనుకుంటూ రేపు తెలుస్తుందిలే అనుకొని ఇంటికి వచ్చాడు సామ్యేలు.

చాలాకాలం తర్వాత పనిచేసి అలసిపోయిన వానిగా తృప్తిగా ఇంటికి చేరాడు. ఒకప్పుడు కారు ఓనరు, ఇప్పుడు డ్రైవరు. ఏ ఒక్కరికో డ్రైవరు కాదు, రాష్ట్రమంతటికీ డ్రైవరు. ఒకప్పుడు ఒంగోలులో ఒక ప్రెస్‌కి ఓనరు. తన ప్రెస్‌లో అయిదారుగురు పనివారు ఎప్పుడూ వుండేవారు. ఇప్పుడైతే ఒక ఇంట్లో కాపురమున్న ఒక భార్యా, భర్త, ముగ్గురు పిల్లలు ఓనర్లుగా వున్న ఇంటి ప్రెస్‌లో వర్కరు. తను తప్పితే మరో వర్కరు అక్కడ లేదు. అక్కడ ఓనరే వర్కు మేస్త్రీ, చార్జిమేన్, కంపోజిటర్, బైండర్, ట్రెడిల్‌మాన్. లుంగీ, చేతుల బన్నీను, మాసిన గడ్డం ఒక అందమైన ఓనర్ కమ్ వర్కర్.

తిన్నగా సాగే త్రోవ నుండి ఆ కరాటపు వీరభద్రయ్య డైరెక్షన్‌లో ప్రయాణం మరో మలుపు తిరిగింది. ఈ దారి మరో మలుపు తిరిగేది ఎప్పుడో. ఉదయాన్నే లేచి హాస్పిటల్‌కి వెళ్ళి రిజిష్టరులో సంతకం చేసి ప్రెస్ వద్దకు చేరాడు సామ్యేలు. నేను ఇక్కడికి రావడం ఇష్టముందా లేదా అని అడుగుదామనుకున్నాడు. ఇంట్లో నుండి ఏమీ శబ్దాలు వినబడటం లేదు. అసలు ఇంట్లో మనుష్యులు వున్నారో లేదో. కొంచెంసేపు ఆగి విసుకుపుట్టి చీపురు తీసుకొని ప్రెస్ ఊడుస్తుంటే, ఓనరు భార్య కాబోలు లోపల నుండి బయటకు వెళ్తూ సామ్యేలును చూసింది. లోపల కూడా ఊడ్చు అని అంటుందేమో అనుకున్నాడు. కాని అక్కడ ఒక మనిషి వున్నాడన్న సంగతి కూడా పట్టించు కోకుండా వెళ్లిపోయింది. ఆమె కూడా ఓనరే కదా! అయినా నువ్వెవరు అని అయినా అడక్కుండా ఎలా వెళ్లింది అనుకున్నాడు సామ్యేలు. రెడ్డిగారు టిఫిన్ చేసి ప్రెస్‌లోకి వచ్చినప్పుడు 'గుడ్‌మార్నింగ్' అన్నాడు సామ్యేలు దానికి జవాబు చిన్న నవ్వు. తర్వాత పెదాలు కదిలాయి, కాని స్వరం వినబడలేదు. ఇంతకీ నేను ఇక్కడికి రావడం వారికి ఇష్టమా? కష్టమా? అనేది తేలాలి కదా! ఒకవేళ రెడ్డిగారినే అడిగితే ఆయన చెప్పే జవాబు తనకు వినబడకపోవచ్చు. ఏమైతేనేమి వేచి చూడక తప్పదు.

ఒంగోలులో ప్రెస్ నడిపేటప్పుడు సామ్యేలు అన్ని పనులు తనే చేసుకొనే వాడు. కనుక ఓనర్ వర్కర్ అనే బేధము లేకుండా వుంది. ఇప్పుడైతే వర్కర్ ఎప్పుడూ ఓనర్ ఫీలింగ్స్ గమనించి చెయ్యాలి. సాయంకాలానికి ప్రెస్ అంతా సామ్యేలు అనుకున్నట్లుగానే చక్కచేయబడింది. ఇప్పుడు తను వెళ్లిపోయినా, తన అవసరము వారికి లేదనుకున్నా కూడా ఏదో ఒక పని చేసి ముగించిన తృప్తి వుంటుంది కదా అనుకున్నాడు. సాయంకాలం రెడ్డిగారు దగ్గరగా వచ్చాడు. చేతిలో కంపోజింగ్ స్టిక్ లేదు. నవ్వుతూ వున్నాడు. ఇక చాలు అంటున్నాడు కాబోలు అనుకుని తలెత్తి చూశాడు సామ్యేలు. మీకు నేను జీతం ఇవ్వటం భావ్యంకాదు కదా! అయినా ఏదో ఇవ్వాలి కదా! ఎంతివ్వమంటారు. అయినా నిన్ను ఇకరావొద్దని కాదు. మీరు రోజూ రావాలి అన్నాడు సామ్యేలు. అక్కడ మీకు ఏమీ పనిలేదని విన్నాను' అన్నాడు సామ్యేలు. ఈ నాలుగు మాటలు చెప్పటానికి చాలాసార్లు రిహార్సల్స్ వేసుకున్నట్లుగా అనిపించింది. గుండె కొంచెం కుదుటపడి తేలికగా నవ్వేడు సామ్యేలు. 'నాకేమీ ఇవ్వనవసరము లేదండీ. ఎప్పుడైనా అవసరం వచ్చినప్పుడు నేనే అడుగు తాను అన్నాడు సామ్యేలు. హమ్మయ్య ప్రెస్‌లో చేరినట్లే.

(సశేషం)

బాలల శీర్షిక

# బైబిలు జ్ఞానము

రెండవదిగా మనం చూసినప్పుడు, తల్లిదండ్రుల తర్వాత చిన్నబిడ్డల యొక్క బాధ్యత సంఘకాపరిది. అంటే, సంఘకాపరి సండేస్కూలును నిర్వహిస్తూ చిన్నబిడ్డలను సండేస్కూలుకు వచ్చులాగున, వారిని ఆకర్షించులాగున వివిధ కార్యక్రమాలను నిర్వహించాలి. పెద్దవారైతే దేవుడంటే భక్తితోనో, భయంతోనో పిలవకుండానే చర్చికి వస్తారు. మరి చిన్నబిడ్డలకు దేవుని యందలి భయము, భక్తి తెలియదు కాబట్టి వారిని దేవుని యొద్దకు నడిపించటం చాలా కష్టతరం. వారిని ఆకర్షించే విధంగా చిన్నచిన్న బహుమతులను ఇవ్వడం ద్వారా లేదా చాక్లెట్స్ ఇవ్వడం ద్వారా వారు సండేస్కూలుకు రావడం జరుగుతుంది. బిడ్డలు సండేస్కూలుకు అలవాటు పడేంత వరకు వారిని ఆకర్షించే విధంగా చర్యలు తీసుకోవాలి. దురదృష్టవశాత్తు ఏ సంఘకాపరి కూడా చిన్నబిడ్డలకోసం కొంత డబ్బును ఖర్చు చేయడానికి ఇష్టంగా లేరు. పైపెచ్చు చిన్నబిడ్డలు చందా కూడా వేయరు అన్న భావంతో సండేస్కూలు నిర్వహణపై అంత శ్రద్ధచూపటం లేదు. అయితే చిన్నబిడ్డలను దేవుని దగ్గరకు నడిపించుట కొరకు వారికోసం వెచ్చించే ప్రతి పైసా వారి ఆశీర్వాదాన్ని రెట్టింపు చేస్తుంది. అంతేకాక 1కొరింథి. 15:58 ప్రకారం మనం చూచినట్లయితే **"కాగా నా ప్రియ సహోదరులారా, మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థముకాదని యెరిగి, స్థిరులును, కదలనివారును ప్రభువు కార్యాభివృద్ధి యందు ఎప్పటికిని ఆసక్తులునై యుండుడి"** అని అపొస్తలుడైన పౌలు చెప్తున్నట్లుగా గ్రహించగలం. ప్రభువు కార్యము అనగా యేసుప్రభువు యొక్క పని అని మనం అర్థం చేసుకోగలము. మరి యేసయ్యకి ఇష్టమైన చిన్నబిడ్డలను గురించి మనం శ్రద్ధ తీసుకున్నట్లయితే, ఒక చిన్నబిడ్డను మనం దేవుని యొద్దకు నడిపించినట్లయితే యేసుప్రభువు ఎంతో సంతోషిస్తాడు. అలాగే మనం మార్కు సువార్త 9:37 చూచినట్లయితే **"ఇట్టి చిన్నబిడ్డలలో ఒకనిని నా పేరట చేర్చుకొనువాడు నన్ను చేర్చుకొనును. నన్ను చేర్చుకొనువాడు నన్నుగాక నన్ను పంపిన వానిని చేర్చుకొనును"** అని యేసుప్రభువు చెప్తున్నాడు. అనగా ఒక చిన్నబిడ్డను దేవుని పేరట చేర్చుకున్నప్పుడు యేసయ్యను మనం చేర్చుకున్నట్లే. అంతేకాక ఆయనను పంపిన తండ్రిని కూడా చేర్చుకున్నట్లేనని గ్రహించాలి. యేసుప్రభువు తనను చిన్నబిడ్డలతో పోల్చుకున్నాడు. మరి చిన్నబిడ్డలను దేవుని దగ్గరకు ఎలా తీసుకురాగలము? వారికి దేవుని గురించి ఎలా తెలియజేయగలము? కేవలం సండేస్కూలుకు వారిని నడిపించడం ద్వారానే సాధ్యమవుతుంది. మరి ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న సండేస్కూలు నిర్వహణ బాధ్యతను సంఘకాపరులు నిర్లక్ష్యం చేస్తే దేవుని తీర్పుకి గురికాక తప్పదు.

చాలామంది సంఘకాపరులు సండేస్కూలు నిర్వహించక పోవడానికి అనేక కారణాలు చెప్తుంటారు. పిల్లలు సండేస్కూలుకు రావడానికి ఇష్టపడరని, వాళ్ళు ఎప్పుడు ఆటపాటల యందే ఆసక్తి చూపుతుంటారని, తల్లిదండ్రులు కూడ బిడ్డలను సండేస్కూలుకు పంపడానికి ఆసక్తి చూపరని అందువల్ల సండేస్కూలు సరిగ్గా జరగదని చెప్తారు. అవన్నీ నిజమే కావచ్చు, అంతమాత్రాన సండేస్కూలు జరపటం మానెయ్యాలా? ఒకరిద్దరు పిల్లలు వస్తే మాత్రం జరపకూడదా? ఒకవేళ ఆ వచ్చిన ఒకరిద్దరు పిల్లలు వారి జీవితాలలో పొందే ఆశీర్వాదాలు, వారి యొక్క నడవడి ఇతర పిల్లల తల్లిదండ్రులు గమనించినప్పుడు వారి బిడ్డలను కూడా సండేస్కూలు పంపడానికి ఆస్కారం వుంటుంది కదా. దేవుని కొరకు ఒక్క ఆత్మను సంపాదించాలి అన్న పట్టుదల వున్నప్పుడు ఆ దిశగానే ప్రయత్నాలు చెయ్యగలం.

**"బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడైనప్పుడును దానినుండి తొలగిపోడు"** సామెతలు 22:6. బిడ్డలను సరైన మార్గములో నడిపించాల్సిన బాధ్యతను, చిన్నబిడ్డలలో **'బైబిలు జ్ఞానము'**ను పెంపొందించాల్సిన బాధ్యతను దేవుడు సంఘకాపరుల మీద వుంచాడనటంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. ఏ సంఘంలో అయితే చిన్నబిడ్డలు నిర్లక్ష్యానికి గురికాబడతారో ఆ సంఘంలో అభివృద్ధి వుండదు. అంతేకాదు దేవుని ఆశీర్వాదాలు కూడా అందవు. మొగ్గని మనం కాపాడగలిగితే అదే పువ్వు అవుతుంది, పండు అవుతుంది, ఎన్నో విత్తనాలను అందిస్తుంది. చిన్నబిడ్డలను దేవుని యొద్దకు నడిపించటానికి అవసరమైన జ్ఞానము, శక్తిని అనుగ్రహించమని దేవుని ప్రార్థించుదాం.

సాక్ష్యము

# యేసు ప్రభువు దర్శనం

2000 సంవత్సరము జనవరి 10వ తేదీన నా కళ్ళు పచ్చగా ఉన్నాయని నా భార్య చెప్పింది. మా యింటికి దగ్గర్లో ఉన్న రాంబాబు డాక్టరుగారి దగ్గరకు వెళ్ళాను. 2 శాతం మాత్రమే ఉంది అని మందులు వ్రాశారు. పది రోజుల్లో నయమయింది.

ఫిబ్రవరి 8న నా భార్య మరలా నా కళ్ళు పచ్చగా ఉన్నాయిని చెప్పి ఆసుపత్రికి వెళ్లమంది. పసికర్లు వచ్చిన వాళ్లంతా భయపడి చస్తారు. డాక్టరు దగ్గరకు పోతే కఠినమైన భోజన ఆంక్షలు పెట్టి మజ్జిగ మాత్రమే త్రాగి ఉండాలని అంటారు. శరీరంలోని జబ్బును ఎదుర్కోటానికి శక్తి ఆహారంలో వస్తుంది. అదే తగ్గిపోతుందులే అని డాక్టరు దగ్గరుకు వెళ్లకుండా, పథ్యం చేయకుండా నెల రోజులు వున్నాను.

ఒకరోజు మధ్యాహ్నం నా స్నేహితుడు గవర్నమెంటు హాస్పిటల్లో కంటి వైద్యుడైన డాక్టరు మురళి వచ్చి, నా కళ్ళు చూచి ఆశ్చర్యపోయాడు. నెల రోజుల నుండి నువ్వు నన్ను చూడటానికి రాలేదు. సంగతి ఏమిటో కనుక్కుందామని వచ్చాను అన్నాడు. వెంటనే ఆయన బండి మీద గవర్నమెంటు హాస్పిటల్‌కి తీసుకెళ్ళి నన్ను చేర్పించాడు.

ఒక నెలరోజులు అక్కడ ఉన్నాను కాని ఏ మాత్రం నయం కాలేదు. నా తమ్ముడు జోషి ఇంటికి తీసుకొని వచ్చి స్టేషన్ దగ్గర వున్న చలపతి అనే నాటువైద్యుని పిలిపించాడు. ఆయన నెల రోజులు వైద్యం చేశాడు. ప్రతిరోజు గంధం నూరించి ముద్దలు మింగించే వాడు. ఇంకా ఏవో చూర్ణాలు మింగించాడు. కడుపు రోజురోజుకి పెరిగి పెద్దదై ప్యాంటు వేసికోలేక పోయాను.

మా ప్రక్కింటి వెంకటేశ్వర్లుగారింటికి వెళ్ళాను. ఆయన నాతో మాట్లాడుతూ 'ఇవన్నీ ఏమీ పనిచేయవండీ, ఇంకొల్లు పోయి కాల్పించుకుంటే తగ్గిపోతుంది, ఆదివారం వెళ్దాము' అన్నాడు. ఆయన ప్రక్కనే కూర్చున ఒక డాక్టరు 'అదంతా ఎందుకు ఆదివారం లోపల నయం చేస్తాను, మా హాస్పిటల్‌కి రండి' అన్నాడు. సరేనని ఒంగోలులోనే వున్న ఆయన హాస్పిటల్‌కి వెళ్ళి రక్తపరీక్ష చేయించుకున్నాను. ఒకటిన్నర నెల మందులు వాడాను. అయినా ఏమీ నయం కాలేదు.

అక్కడ నుండి నల్లూరి నర్సింగ్ హోమ్‌కి వెళ్ళాను. అప్పటికి నాలుగు నెలలు గడిచిపోయాయి. నర్సింగ్‌హోమ్ వారు ఒక నెల మందులు వాడి మద్రాసుకాని హైదరాబాద్‌కానీ అపోలో హాస్పిటల్‌కి వెళ్ళండి ఇక్కడ నయంకాదు అన్నారు.

కాని నేను ఆ ప్రయత్నమే చేయలేదు. అపోలోకి వెళ్ళాలంటే ఎంత తక్కువ అయినా 50 వేలు అవుతుంది. నేను అప్పు చెయ్యను, చందా అడుగలేను. అప్పటికి నాకు 60 సంవత్సరాలు. సగం ప్రపంచం తిరిగాను. స్వదేశంలో ముప్పాతిక భాగం చూశాను. ఆరు నవలలు రాశాను. 9 మంది పిల్లలు వున్నారు. వారందరూ పెద్దవాళ్ళయి ఎవరి కాళ్ళమీద వాళ్లు బ్రతుకుతున్నారు. ఇంక నేను చనిపోయినా అంతగా బాధపడే వాళ్ళు ఎవరూ లేరు. అప్పుచేసి చచ్చిపోతే ఎంత అసహ్యం?

మా తమ్ముడు జోషి తన కారు ఇచ్చి కొద్దిగా డబ్బు ఇచ్చి హైదరాబాద్ పంపించాడు. ఆ డబ్బుతో అపోలో గేటు వద్దకు కూడ పోలేము. హైదారాబాద్ నుండి తిరిగి వచ్చిన తర్వాత ఇంకా బలహీనమయ్యాను. ఇంట్లో మనుష్యులు ఒక ప్రక్క పిలిస్తే ఇంకొక ప్రక్కకి పోతున్నారు. అయిదు నెలలు మంచంలో వున్నవారు ఎవరైనా అప్పులకు బరువే. ఇందులో అబద్ధం ఏమీ లేదు. నేనైనా అంతేకదా! చనిపోయిన మా అమ్మ గుర్తుకు వచ్చేది. రాత్రులు పెద్దగా అరిచేవాడిని. మా అమ్మ వెళ్లిపోయి హాయిగా వుంది. మా నాయన అమ్మ ఇద్దరు ఏ రుగ్మత లేకుండా హాయిగా వెళ్లిపోయారు. ఇప్పుడు నా కడుపునిండా కత్తులు వున్నట్లుగా ఉండేది. అటు కదిలినా ఇటు కదిలినా విపరీతమైన నెప్పి.

నా ఆఖరి కుమారుడు నతనయేలు బెంగుళూరులో యూత్ మినిస్టరుగా పనిచేస్తున్నాడు. అతను బెంగుళూరు నుండి వచ్చి హైదరాబాద్ వెళ్దాము రా నాన్న అని నన్ను బలవంతము చేశాడు. అపోలోకి వెళ్ళి పరీక్ష చేయించుకొని వచ్చేద్దాము అక్కడ చేరవద్దులే అన్నాడు.

నాకు మొదటిసారి జాండిస్ వచ్చినప్పుడు జనవరిలో పరీక్ష చేసిన రాంబాబు దగ్గరికి సాయంకాలం 6 గంటలకు తీసికొని వెళ్లాడు. ఆయన మూత్రం పట్టి తెమ్మన్నాడు. చీకటి పడుతుంది. నేను మూత్రంపట్టి డాక్టరు దగ్గరు తీసుకెళ్తున్నాను. డాక్టరు దూరం నుండి ఆ మూత్రం రంగు చూసి అక్కడే పెట్టు అని, నా కుమారుని లోపలికి తీసుకెళ్లి వెళ్లి మీ నాన్న రెండు రోజులకంటే ఎక్కువ బ్రతకడు, ఇంక పరీక్షలు అవసరం లేదు అని పంపించాడు. 13 సంవత్సరాలు క్రితం ఆ డాక్టరు మా నాయనను పరీక్షించి గుండె పెద్దదయింది. ఇంక రెండు

నెలలకంటే ఎక్కువ బ్రతకడు అని చెప్పాడు. అలానే మా నాయన చనిపోయాడు. ఇప్పుడు నేను రెండు రోజులకంటే ఎక్కువ బ్రతకనని చెప్పాడు.

ఇంటికి వచ్చిన తర్వాత ఆ సంగతి అందరికి తెలిసి పోయింది. నేను రెండు రోజులే బ్రతుకుతానని. వెంటనే నా కుమారుడు డబ్బు తేవడానికి బెంగుళూరు వెళ్ళాడు. చనిపోయే ముందు నన్ను చూడటానికి దూరప్రాంతాల నుండి బంధు వులు స్నేహి తులు రావటం ప్రారంభించారు. నేను ఏ మాత్రం ఆలోచించటం లేదు. భయపడలేదు, దిగులుపడలేదు.

పౌలు చరిత్ర మొదటిభాగం అపొస్తలుడు వ్రాసినప్పుడు పీఠికలో ఇలా వ్రాశాను – పౌలు చరిత్ర వ్రాయటం పొర పాటున మొదలుపెట్టాను అనిపిస్తుంది. పౌలు చరిత్ర చాలా పెద్దది. ఎంతో మంది మనుష్యులు, ప్రదేశాలు, దేశాలు వ్రాయాలి. అప్పటిదాక దేవుడు నన్ను బ్రతకనియ్యాలి అని వ్రాశాను. ఇప్పుడు మూడవభాగం తిమోతి సగం వ్రాశాను. నేను చచ్చిపోతే ఎవరు వ్రాస్తారు. ఇంతవరకు నేను ఆరు పుస్తకాలు వ్రాశాను. అటువంటి పుస్తకాలు ఏ భాషలో ఎవరూ వ్రాయలేదని గ్యారంటీగా చెప్పగలను. ఇప్పుడు తిమోతి పుస్తకం పూర్తి అయిన తర్వాత చనిపోతే బాగుండు అనుకున్నానే కాని రోగం బాగై బ్రతకాలనుకోలేదు. అయినా నా గొప్పతన మేముంది ప్రభువు నాతో వ్రాయించాడు. నువ్వు పోతే వేరొ కరితో వ్రాయిస్తాడు అని అనుకొనినప్పుడు నా మనసు కుదుట పడింది. మరణాన్ని ఆహ్వానించాను.

నా ప్రక్క అంతస్తుల ఇల్లు మా తమ్ముడు జోసఫ్‌ది. ఒక అంతస్తులో ఎప్పుడూ ఎవరో ఒకరు ఇద్దరు, పదిమంది, పాతికమందైనా తెల్లవాళ్లు వుంటారు. అప్పుడు ఇద్దరు ఆడవాళ్లు. ఒకామెకు 60 సంవత్సరాలు, ఒకామెకు 40 సం॥లు. ఆమెకు స్వస్థతవరం వుందంట. అందుకని ఇల్లు కదల్లేని రోగులవద్దకు ప్రతిరోజు ఉదయాన్నే ఇద్దరు ముగ్గురు పాస్టర్లు, సామ్రాట్ (మా తమ్ముని పెద్దకొడుకు) ఆమెతో వెళ్లి ప్రార్ధన చేసి మధ్యాహ్నానికి ఇంటికి రావడం ప్రతిరోజు నేనున్న ఇంట్లో నుండి (మిద్దెపైన) చూస్తున్నాను. కాని ఆమెను పిలిచి ప్రార్ధన చెయ్యమని అడుగలేదు. పైగా యేసుప్రభువుకు రికమండేషనా? అనుకునే వాడిని. ఆయన చిత్తమైతే బ్రతుకు తాను లేకుంటే లేదు అనుకునే వాడిని. ఆ ఉదయం ప్రక్కింట్లో వున్న అమెరికా ఆమె జానెట్ 'నేను వచ్చి ప్రార్ధన చేసేదా?' అని కబురు చేసింది. సంతోషంగా రండి అని కబురు చేశాను కాని ఆమె రాలేదు. సాయంకాలం కూడా రాలేదు. మరునాడు సాయంకాలం మిద్దెమీద పిట్ట గోడకి మంచం ఆనిచ్చి కూర్చుని క్రిందకు చూస్తున్నాను. ఎదురుగా మా చర్చికి మా ఇంటికి మధ్య రోడ్డు వుంది. చర్చి తలుపులు మూసి వున్నాయి. చీకటి పడుతుంది. పిట్టగోడమీద తొట్లలో పూలచెట్లు వున్నాయి. నేను చర్చీని చూస్తున్నాను. నాకు పెద్ద కడుపు, చెప్పలేనంత పెద్ద లివర్. అంతలో భళ్ళున చర్చీ తలుపులు తెరచుకొని జానెట్ బయటికి వచ్చింది. ఆమె వెంట నలుగురు ఆడవాళ్ళు వున్నారు. ఆమె వాళ్లతో ఏదో మాట్లాడుతున్నది. నిన్న ఈమె వస్తానని చెప్పింది ఎందుకు రాలేదో అనుకున్నాను. ఇంతలో ఒక చిన్న పిల్లవాడు వచ్చి – 'తెల్ల దొరసాని నీకు ప్రార్ధన చెయ్యటానికి వస్తుంది' అన్నాడు. 'సరే రమ్మను' అని చెప్పి ప్రక్కనే నిలబడి వున్న నా భార్యతో 'జానెట్ వస్తానంది, నువ్వు క్రిందికి వెళ్ళి, ఆమెను పైకి తీసుకునిరా' అన్నాను. నేను చర్చీ వరండాలో నిలబడి వున్న జానెట్‌ని ఆ పల్లెటూరు ఆడవాళ్లని చూస్తూ ఉన్నాను.

అంతే – నేను లేచి ఒక ఇంట్లోకి ప్రవేశించాను. లోపల పెద్ద హాలు. మధ్య తరగతి కుటుంబీకుల ఇల్లు. బీదవారు కాదు గొప్పవారు కాదు. కుడిప్రక్కకు చూశాను. అక్కడ యేసు ప్రభువు వున్నాడు. (యేసుప్రభువు ఫోటో ఏదీ నేను మా యింట్లో కాని ఆఫీసులో కాని ఉంచను. 1960లో ఒంగోలుకు 'ది టెన్ కమాండ్‌మెంట్' సినిమా వచ్చింది. నేను ఆ హాలు వారి దగ్గరకు వెళ్ళి ఊరువాడలా ఆ సినిమాని గురించి ఆడ్వర్‌టైజ్ చేస్తానంటే ఒక కారు, మైకు ఇచ్చి పంపించారు. 15 రోజులు పల్లెపల్లెలా ఉచితంగా ఆ సినిమా గురించి చెప్పాను. ప్రతిరాత్రి రెండు ఆటలు ఆ సినిమా చూశాను. అందువలన మోషే అనగానే ఆ సినిమాలో మోషే గుర్తుకు వస్తాడు. యేసుప్రభువు 30 సంవత్సరాల లేత వయస్కుడైతే 40 ఏండ్లవానిగా ఫోటోలు చూపిస్తారు. యేసుప్రభువును ఈ లోకంలో ఎవరు అనుకరించ గలరు? ఆ దీనత్వం, ప్రేమ, జాలి కళ్ళలో ఏ మానవుడు చూపగలడు? అనుకొనే వాడిని).

నేను ఇంటి లోపలికి వచ్చి కుడిప్రక్కకు చూసినప్పుడు యేసుప్రభువు యూదులు భోజనము చేసే పద్ధతిలో కూర్చుని వున్నాడు. ఎడమ చేతిమీద ఆనుకుని ఎడమవైపుకి పండు కున్నట్లుగా గోడకు కాళ్లు చాపి కుడిచేత్తో రొట్టె తింటున్నాడు. రొమ్మున ఆనుకొనిన శిష్యుడు, అనగా యేసుప్రభువు భోజనము నకు పైవిధంగా కూర్చున్నప్పుడు యేసుప్రభువుతో మాట్లాడా లంటే యేసుప్రభువు రొమ్ముకు తన వీపు తగిలేటట్లుగా తిర గాలి. పరిసయ్యుని ఇంట్లో ప్రభువు ఈ విధంగానే భోజనము నకు కూర్చునప్పుడు పాపాత్మురాలైన స్త్రీ ఈ విధంగా భోజన మునకు కూర్చుని వున్న యేసు పాదమును కన్నీటితో కడిగింది.

యేసుప్రభువు ఆ విధంగా రొట్టెతింటూ, నేను లోపలికి వచ్చినప్పుడు తలెత్తి నన్ను చూశాడు. 'వచ్చావా?' అన్నట్లుగా

చూచి ఆ హాలు మధ్యలో చాప మీద కూర్చుని వున్న ఒక వ్యక్తితో ఏదో సీరియస్‌గా మాట్లాడుతున్నాడు. నేను నా తల త్రిప్పి ఆ వ్యక్తిని చూడలేదు. యేసుప్రభువు మీద నుండి నా కళ్లు త్రిప్పలేదు. కొంచెంసేపు నిలుచున్నాను. కడుపు ఎత్తుగా, కాళ్ళుచేతులు సన్నగా, కడుపు బరువుగా నెప్పిపుట్టింది. అక్కడే చూస్తూ కూర్చున్నాను. అప్పుడు ప్రభువు తలత్రిప్పి నన్ను చూసి మరలా ఆ హాలులో వున్న వ్యక్తితో ఏదో భాషలో మాట్లాడు తున్నాడు. నాకు ఆ భాష అర్థంకాలేదు.

అంతలో నేను లోనికి వచ్చిన దారినే ఒక స్త్రీ నాకు, ప్రభువుకు మధ్యగా వచ్చి మరొక రొట్టె ఆయన ప్లేటులో పెట్టి వెళ్లింది. ఆమె కాళ్లు మాత్రం చూశాను. ఆమె ముఖం చూడలేదు. కాని వెంటనే ఆమె పేతురు అత్త అని, ప్రభువుకు పరిచర్య చేస్తుందని, ప్రభువు మాట్లాడుతుంది పేతురుతో అని, ఇది పేతురుగారి ఇల్లు అని గ్రహించాను.

తర్వాత ప్రభువు పరుపు మీద నా ఎదురుగా ఐదు అడుగుల దూరంలో కూర్చుని నన్ను చూస్తున్నాడు. నేను కూడ ఆయన ముఖాన్ని, ఆయన వెంట్రుకలను (మెడ మీద వరకే వున్నాయి), చిన్న గడ్డం, బలమైన శరీరం, గుండ్రని లేత ముఖం 30 సంవత్సరాల యౌవనస్తుడు. తెల్లని అంగీ కొంచెం ఆకుపచ్చ రంగు. చాలాసేపు ఆయన కళ్ళలోకి చూస్తున్నాను. ఆయన కూడ నన్ను కన్ను ఆర్పకుండా చూస్తున్నాడు. దాదాపు పది నిమిషాలైనా ఏమీ మాట్లాడకుండా ఒకరినొకరం చూసుకుం టున్నాము. ప్రభువు నా గురించి ఏమి ఆలోచిస్తున్నాడో కాని, నేను మాత్రం ఆయన రూపురేఖలు చూస్తూ ఈయనది జపాన్ ముఖమా, చైనా ముఖమా? ఏదీ కాదు మన ముఖమే. ఆసియా వాసుల ముఖమే అని అలా ఆలోచిస్తున్నాను.

తర్వాత ఆయన లేచి నేను వచ్చిన వాకిట్లో గుండా వెళ్తున్నాడు. నేను లేచి ఆయనను అనుసరించాను. నా వెనుక పేతురుగారు వస్తున్నాడు. కాని నేను యేసు మీద నుండి నా కళ్లు త్రిప్పలేదు. సాయంకాలం సూర్యుడు ఆయన వీపు మీద పడుతున్నాడు. ఇంట్లో లేతపచ్చరంగులో వున్న అంగీ ఇప్పుడు సూర్యకిరణాల వల్ల ముదురు ఆకుపచ్చరంగుకు వచ్చింది. ఇంటి ప్రక్కగా ముగ్గురం నడుస్తున్నాము. ఇంటి ముందు భాగమున పెద్ద వీధి. పట్టణమంతయు ఆ యింటి వాకిట కూడియున్నది. ఆయనను చూడగానే అంతా లేచి నిల్చున్నారు. కాని ఎవరూ గోల చెయ్యటం లేదు. ఇంటి చుట్టూ చెక్క ఫెన్సింగ్ వుంది. ఇంటిముందు గేటు ఎదురుగా ప్రభువు నిలుచున్నాడు. నేను ఆయన ఎడమ ప్రక్కన నిలుచున్నాను. నా ఎడమప్రక్కన పేతురుగారు నిలుచున్నాడు. ఆయినా నేను పేతురుగారి ముఖం చూడలేదు. ప్రభువు ముఖం నుండి నా కన్నులు త్రిప్పలేదు. ఆయన తల త్రిప్పి నన్ను చూశాడు. నేను వెళ్ళి మా ఎదురుగా వున్న పెద్ద గేటు పైన వేయబడిన గడియ తీసి ప్రభువు వైపు చూస్తూ వచ్చి మామూలుగా ఇందాక నిలబడివున్న చోటనే నిలుచున్నాను. గేటులో నుండి లోనికి వచ్చిన ఒక యౌవనస్తుడు ప్రభువు ఎదురుగా నిలబడ్డాడు. ఆయన తన రెండు చేతులు ఆ యౌవనస్తుని కణతల మీద పెట్టి, తల పైకెత్తి చూస్తున్నాడు. ఎడమ ప్రక్కన నిలుచున్న నేను ఆయన ముఖం చూస్తూ – నాలాగా యేసుప్రభువును ఇలా దగ్గరగా నిలిచి చూసే భాగ్యం ఈ లోకంలో ఎవరికీ కలుగులేదు అనుకుంటున్నాను. ఆ రోగియైన యౌవనస్తుని లోపలి రోగమంతా ప్రభువు తన శరీరంలోనికి తీసుకుంటు న్నాడు. ఆ యౌవనస్తుని ముఖం ఇప్పుడు తేటగా మారింది. ప్రభువు తన చేతులు అతని మీద నుండి తీస్తూ నావైపు చూశాడు. అతను స్వస్థత పొందినవాడై ప్రభువు కుడివైపుగా లోపలకి వెళ్ళాడు.

**ఇంతలో** చాలమంది మనుష్యులు పెద్దపెద్దగా మాట్లాడు కుంటూ ధనధనమని మెట్లు ఎక్కుతున్న శబ్దం వినిపించి నా తలతిప్పి ఎడమవైపుకు చూశాను. నేను కూర్చున్న మంచము వెనుక క్రింద నుండి పైకి మెట్ల మీదుగా జానెట్ పైకి వచ్చింది. ఆమె వెనుక సూసన్, స్ట్రామట్, మరి ఆరుగురు పాస్టర్లు పైకి వచ్చారు. వారిని ముందుకు రానీయకుండా జానెట్ వారికి అడ్డంగా నిలబడి నావైపు వింతగా చూస్తుంది. ఆమె నన్ను అంతకు ముందు చూచి వుండలేదు. ఆమె అలా ఎందుకు చూస్తుంది? అక్కడే ఎందుకు నిలబడిపోయింది అనుకుంటూ నా రెండు పాదాలు, కాళ్ళు, నా చేతులతో ఎత్తి ఇవతల పెట్టి లేచి నిలబడి ఆమె వైపుగా నడవటం ప్రారంభించాను. ఆమె వెంటనే కదిలి, నా వైపు వస్తూవుంది. కాని ఆమె మెడవంచి, కళ్ళు పైకెత్తి నన్ను పరీక్షగా చూస్తూ నా దగ్గరకు వస్తూవుంది. ఈమె అలా ఎందుకు చూస్తూ వస్తుంది? అనుకుంటూ నేను కదిలాను. మేము ఒకరికొకరం దగ్గరగా వచ్చినప్పుడు ఆమె నా కళ్ళలోకి కళ్ళు పెట్టి చూస్తూ –

'ఇప్పటిదాక నువ్వు ప్రభువు ఎదురుగా నిలబడి ఆయన కళ్ళలోకి చూస్తున్నావు కదూ!' అంది. ఔను కదా నేను ప్రభువు ముఖం చూస్తూ వున్నాను కదా అనుకున్నాను. **"నువ్వు ప్రభువును చూస్తున్నావు. నేను కూడా మీ యిద్దరిని చూశాను, కానీ నేను ప్రభువు వీపు మాత్రం చూస్తున్నాను. నువ్వు ఆయన ముఖం చూస్తున్నావు. ఈలోకంలోని మరెవరూ ప్రభువు ముఖం చూడలేదు. నువ్వైతే నీ యీ కళ్ళతో ఆయనను చూస్తున్నావు. నేను వెనుక భాగం చూశాను ఆయన ముఖం చూడలేదు. నువ్వు ధన్యుడవు"** అన్నది.

నేను లోపలికి నడిచి సోఫాలో కూర్చుని నా ఎదురుగా వున్న కుర్చీలు చూపించి వారిని కూర్చోమన్నాను. ఆమె వెంటనే –నేను కూర్చోను నువ్వు ప్రభువును చూశావుగా అన్నది. అందరూ నిలబడే వున్నారు. ప్రార్థన చెయ్యమని అడిగాను ఆమెని. నేను ప్రార్థన చెయ్యను, నువ్వు ప్రభువును చూశావుగా అన్నది. ఆమె ఎందుకు ప్రార్థన చెయ్యననింది అని అనుకుంటూ వుంటే, ఆమె దగ్గరగా వచ్చి 'నీ కాళ్ళు కడుగుతాను' అంది. నేను ఆశ్చర్యపోయి సామ్రాట్‌ని 'ఈమె రోగికి ప్రార్థన చేసేముందు వాళ్ళ కాళ్లు కడుగుతుందా?' అని అడిగాను. 'లేదు పెదనాన్న, ఈమెతో గత పదిరోజులుగా తిరుగుతున్నాము, ఆమె ఎవరి కాళ్ళూ కడగలేదు' అన్నాడు. మేము తెలుగులో మాట్లాడుకుంటుంటే నాకు ఇంగ్లీషు రాదను కొని ఆమె సామ్రాట్ వైపు తిరిగి 'నేను మీ పెద్దనాయన కాళ్ళు కడుగుతానని ఆయనకి చెప్పండి' అన్నది.

'ఆయనకు ఇంగ్లీషు వచ్చు' అన్నాడు సామ్రాట్. నా చిన్న కూతురు జయశీలిని పెద్ద బేసిన్, ఓ జగ్గుతో నీళ్ళు తెచ్చి నా పాదాల మీద నీళ్ళు పోస్తుంటే జానెట్ నాకు ఎదురుగా నేలమీదకు వంగి నా రెండు మోకాలు నుండి పాదాల వరకు కడిగి లేచి నా ప్రక్కగా వచ్చి తన కుడి చేయి నా కుడి భుజం మీద వేసి నిలబడింది. మీరు ఏ దేశం నుండి వచ్చారు, ఎంతకాలం వుంటారు, మీ వయస్సెంత మొదలైన ప్రశ్నలు అడుగుతుంటే ఆమె జవాబు చెప్పి 'ఇక వెళ్తాము' అన్నది. 'ప్రార్థన చేసి వెళ్లండి' అన్నాను. 'లేదు, నువ్వు నీ కళ్ళతో ప్రభువును చూశావు' అని ప్రక్కకి వెళ్ళి నా కుమార్తె ఆమె చేతుల మీద నీళ్లు పోస్తుండగా సబ్బుతో చేతులు కడుక్కుని వెళ్ళిపోయింది.

పెద్ద కడుపు, సన్నని కాళ్ళు చేతులతో నాకు ఏమి స్వస్థత కలుగలేదు. కదిలితే కడుపులో కత్తులు గుచ్చుకున్న నొప్పి. నా చిన్న కుమారుడు నతనయేలు బెంగుళూరు నుండి వచ్చాడు. నా తమ్ముడు కొంతడబ్బు యిచ్చాడు. మరునటిరోజు హైదరాబాద్ వెళ్ళి పరీక్ష చేయించుకొని వెంటనే ఒంగోలు రావాలి అన్నాడు నా కుమారుడు. ఉదయాన్నే నా స్నేహితుడు డా॥ కృపారావుని చూసి సాయంకాలం హైదరాబాదు వెళ్దాము అన్నాను. ఉదయం 8 గంటలకు డా॥ కృపారావుగారి హాస్పి టల్‌కు వెళ్ళాము. అక్కడి నర్సులు ఇద్దరు నా దగ్గరకి వచ్చి 'ఇంత కడుపు అయ్యేదాకా వుండి, ఇప్పుడు చావటానికి ఆస్పత్రికి వచ్చావా' అని కోపంగా అన్నారు. 'అదికాదు కృపారావు నా స్నేహితుడు. ఆయనను చూడటానికి వచ్చాను' అన్నాను. అందుకు వారు 'ఆయన ఆ చివరి గదిలో వుంటారు, ఆయన చాలాకాలంగా పేషంట్సుని చూడటంలేదు, ఆయన కుమారుడు కేశవబాబు చూస్తున్నారు' అని చెప్పారు. అయితే యింటికి వెళ్దాము అన్నాను నా కుమారునితో. వచ్చాము కదా చూపించుకొని వెళ్దాము అన్నాడు నా కుమారుడు. నేనింత వరకు కేశవబాబును చూడలేదు. ఆయన గదిలోకి వెళ్ళి 'నేను మీ తండ్రిగారి స్నేహితుడను, ట్రీట్‌మెంట్‌కోసం రాలేదు, నా పరిస్థితి ఎలా వుందో తెలుసుకుందామని వచ్చాను' అని చెప్పాను.

అందుకు ఆయన 'మీరు లోపలికి వచ్చేటప్పుడే చూశాను, మీరు రెండురోజుల కంటే ఎక్కువకాలం బ్రతకరు' అని 'అయినా మీరు హైదరాబాద్ వెళ్ళాలనుకుంటే డా॥ నాగేశ్వరరావుగారి వద్దకు వెళ్ళి ప్రయత్నించి చూడండి. పంజాగుట్టలో మెడినోవా వ్యాధి నిర్ధారణ కేంద్రం అది అన్నాడు. 'సరే, రిఫర్ చేయండి, మేము హైదరాబాద్ వెళ్ళా లనుకుంటున్నాము' అని చెప్పాను. 'ముందు మీ రైల్వే రిజర్వేషన్ టిక్కెట్లు నాకు చూపండి అప్పుడు వ్రాసి ఇస్తాను' అన్నాడు. రైల్వేస్టేషన్ ప్రక్కనే వుండటం వలన నా కుమారుడు అరగంటలో రిజర్వేషన్ చేయించుకొని వచ్చాడు. డాక్టర్ కేశవబాబు దగ్గర లెటర్ తీసుకొని ఆ రాత్రే హైదరాబాదు బయలుదేరాము.

నేను హైదరాబాద్ రావటం అక్కడే వున్న నా వాళ్ళెవరికీ సంతోషం కలిగించలేదు. అయినా నా దగ్గర వున్న డబ్బుతోనే పరీక్షలు చేయించుకొని ఎవరినీ నేను ఎప్పుడూ డబ్బులు అడగనని తెలుకున్నారు. పంజాగుట్టలోని మెడినోవాకు ఉదయం 10-30 గంటలకు వెళ్ళాము. 950 రూపాయలు కట్టించు కొని గదిలోకి తీసుకెళ్ళి నోట్లో ఒక ఇనుపగొట్టం పెట్టి వెలుగుతున్న రెండు చిన్నబల్బులు నా కడుపులోకి దించి కంప్యూటర్‌తో ఫోటో తీశారు. తర్వాత సాయంకాలం మూడు గంటల వరకు ఎన్నెన్నో పరీక్షల కొరకు అనేకచోట్లకు తీసుకొని వెళ్ళారు.

చివరలో ఎక్కడో ఒక మూల గదిలో కూర్చున్న డా॥ నాగేశ్వరరెడ్డిగారి (ఈమధ్యకాలంలో ఈటీవిలో శనివారం మార్గదర్శిలో ఆయనను గురించి చూపించారు) వద్దకు తీసికొని వెళ్ళారు. ఆయన చేతిలో నా పరీక్షల కాగితాల కట్ట వుంది. ఆయన వాటిని చూస్తూ, నేను లోపలికి రాగానే **'ఇవన్నీ మీ పరీక్షల కాగితాలు, ఇవికాక మీరు 15 రోజుల క్రితం ఒంగోలులో స్కానింగ్ చేయించిన కాగితాలు వున్నాయి. ఒంగోలులో చేయించిన స్కానింగ్‌లో మీకు 80 శాతం జబ్బు వున్నది. అంత జబ్బుతో ఎవరూ బ్రతకరు. కాని మీరు బ్రతికే వున్నారు. మా స్కానింగ్ మిషన్లు అన్నీ విదేశాల నుండి వచ్చినవి. చాలా మంచి మిషన్లు. కాని వాటిలో తీసిన**

**రిపోర్టులో మీ శరీరంలో ఏ జబ్బు కనిపించటం లేదు. చాలా ఆశ్చర్యంగా వుంది. అందుకే మిమ్మల్ని నాలుగు గంటల పాటు రకరకాల పరీక్షలు చేశాము. మీ తల వెంట్రుకల నుండి పాదాల వరకు రకరకాల పరీక్షలు చేసినా మీ శరీరంలో ఈ జబ్బేకాదు, ఏ రకమైన జబ్బూ లేదు. మీ కడుపు నిండా నీరు వుంది. అది ఇప్పుడు తీస్తే మళ్ళీ వస్తుంది. రెండు రకాల మాత్రలు వ్రాశాను, 21 రోజులపాటు వాడితే కడుపు మామూలు స్థితికి వస్తుంది'** అన్నాడు.

'21 రోజుల తర్వాత మరలా ఇక్కడికి రావాలా?' అని అడిగాను. 'నీకు అసలు ఏ జబ్బు లేనప్పుడు మరలా ఎందుకు రావడం. నీకు ఇష్టమైతే రా, అంతేకాని నువ్వు మరలా ఇక్కడికి రావలసిన అవసరం లేదు' అన్నాడు. 'పథ్యం ఏమిటి?' అని అడిగాను. 'నీ ఒంట్లో నెత్తురు లేదు. అందుకని నీకు ఏది ఇష్టమైతే అది తిను కాని ఉప్పు తక్కువగా తీసుకో' అన్నాడు.

హైదరాబాద్ స్టేషన్‌కి వచ్చి చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కి సీటు మీద పండుకున్నాను. బండి చాలా రద్దీగా వుంది. నా కడుపు చూసిన వాళ్ళంతా భయపడి నన్ను లేవమని అనలేదు. ఒంగోలు వచ్చిన తర్వాత డాక్టరుగారు చెప్పినట్లుగానే అన్నీ రకాలైన భోజనాలు, మాంసం, చేపలు ఎక్కువగా తినటం ప్రారంభించాను. డాక్టరుగారు చెప్పినట్లుగానే నా కడుపు సాఫీగా అయ్యింది. రెండు నెలల తర్వాత ఒకరోజు ఉదయం 9 గంటలకు చర్చీ ముందు కుర్చీలో కూర్చున్నాను. స్కూలు పిల్లలకు బరువు చూసే మిషన్ ఎవరో తీసుకుని వెళ్తుంటే, నేను నా బరువు చూసుకున్నాను. 66 కేజీలు బరువు వున్నాను నేను. నేను పుట్టిన తర్వాత ఎప్పుడూ 60 కేజీలు కూడా లేను. మరలా మూడు నెలలకు తెనాలి స్టేషన్‌లో బరువు చూసుకుంటే 71 కేజీలు వున్నాను. నాకనుమానం వేసి ప్రక్కన కూల్‌డ్రింక్ షాపు అతన్ని మిషన్ బాగానే పనిచేస్తుందా అని అడిగాను. బాగానే వుంది అన్నాడు.

ఒక నెల తర్వాత చర్చీలో బుధవారం సాయంకాలం వాక్యం చెప్తూ ఎడమ చేయి మణికట్టు దగ్గర గీరితే రక్తం వచ్చింది. మరుసటి రోజు గవర్నమెంట్ హాస్పిటల్‌కి వెళ్ళి చెప్పాను. మీకు ఏ జబ్బూ లేదు, శరీరంలో రక్తం ఎక్కువ అయింది అన్నాడు డాక్టరు. ఏం చెయ్యమంటారు అని అడిగాను. రక్తదానం చెయ్యమని సలహా ఇచ్చాడు డాక్టరు. నా రక్తం పనికివస్తుందా? నాకు ఐదు నెలల క్రితం పసికర్లు అయ్యాయి అన్నాను. ఆయన నాకు రక్త పరీక్ష చేసి, మీకు అసలు ఎప్పుడూ పసికర్లు రాలేదు, నీకు బి.పి.కానీ, షుగరు కానీ లేవు అన్నాడు. వెంటనే నేను ఒక బాటిల్ రక్తం దానం చేశాను. 6 నెలల తర్వాత మరలా రక్తదానం చేశాను.

తర్వాత సగం వ్రాసిన 'తిమోతి' పుస్తకం పూర్తి చేశాను. ఆ తర్వాత మొత్తం 14 నవలలు వ్రాశాను. అప్పటి నుండి ఇప్పటి వరకు తలనెప్పి కూడా ఎరుగను. నెలలో పదిహేను రోజులు ప్రయాణాలు చేస్తూనే వున్నాను. ఎప్పుడూ అలసిపోలేదు. ప్రభువు నాకు అప్పగించిన **'హన్నాకృప'** పత్రికను నడిపిస్తున్నాను.

ఒక్క సామ్యేలు రాజేంద్ర చనిపోతే దేవునికేమీ కొదువ కాదు. వందమందిని ఒక్కక్షణంలో ఆయన లేపగలడు. కాని నశించిపోతున్న ఒక పాపినైన నా కొరకు ఆయన ప్రణాళికతో అమెరికా నుండి వచ్చిన జానెట్ అనే ఆమెను సాక్షిగా పెట్టి, 2000 సంవత్సరాల క్రితం (మార్కు సువార్త 1వ అధ్యాయం 29వ వచనము ప్రకారం) జరిగిన సంఘటనలోనికి నన్ను తీసుకొని వెళ్ళాల్సిన అవసరం దేవదేవునికి ఏమీ లేదు?

దేవుని ప్రేమ అనేది మానవ మాత్రులకు వివరించ అసాధ్యము. ఎవరికి వారు అనుభవములో మాత్రమే తెలిసికొనగలిగినది.

**ఈ నెల పోషకులు :**

| | | |
|---|---|---|
| శ్రీ యడవల్లి ప్రసాదరావు | హైదరాబాద్ | 2000 |
| రెవ.డా॥కె.జోసఫ్, ఐ.ఇ.ఆర్.యఫ్ | ఒంగోలు | 1000 |
| డా॥ పి. హుస్సేనయ్య | బేస్తవారిపేట | 1000 |
| రెవ. డా॥ యం.యస్.శాంతవర్ధన్ | గుంటూరు | 1000 |
| శ్రీమతి నలందా సాల్మన్‌రాజు | కడప | 1000 |
| శ్రీమతి పావని | తెనాలి | 500 |
| రెవ. డా॥ బి.వి.ఎబినెజరు | హైదరాబాద్ | 500 |
| శ్రీ యన్. సాల్మన్‌రాజు | కడప | 500 |
| శ్రీ సంపత్ | బిట్రగుంట | 200 |
| శ్రీమతి జయమ్మ | కావలి | 200 |
| శ్రీమతి కృపమ్మ | గుంటూరు | 200 |
| శ్రీ చీమకుర్తి జాన్ వెంకటేశ్వర్లు | ఒంగోలు | 200 |
| శ్రీమతి కె. సౌభాగ్యమ్మ | ఒంగోలు | 200 |
| శ్రీ జె. ఆనందం | ఒంగోలు | 200 |
| శ్రీమతి ఫ్లోరా | చెన్నై | 200 |
| శ్రీ జనార్ధనరావు | బెంగుళూరు | 150 |
| శ్రీ సమాధానం | బెంగుళూరు | 150 |
| శ్రీ సత్యన్నారాయణరెడ్డి | కనిగిరి | 150 |
| సిస్టర్ జ్యోతి | గుంటూరు | 150 |
| శ్రీమతి సుశీల | ఒంగోలు | 150 |

## క్విజ్ ఏప్రిల్ నెల ప్రశ్న ? 41

పాఠకులను వాక్యపు జ్ఞానంలో పెంచటమే ఈ శీర్షిక ఉద్దేశ్యం.

1. **లేవి. 5:7లో** 'అతడు గొఱ్ఱెపిల్లను తేజాలని యెడల.. రెండు తెల్లగువ్వలనేగాని... అవి దొరకని యెడల గోధుమపిండి తేవలెను...యెహోవా సన్నిధికి తీసికొని రావలెను'. యెహోవా ఈ విధముగా చెప్పుటలో ఆయన ఉద్దేశ్యమేమి?
2. సంఖ్యా. **29:6లో** 'ఏడవ నెల మొదటి తేదీన శృంగధ్వని దినము'. ఆ దినము యొక్క ప్రత్యేకత ఏమిటి?

ఫిబ్రవరి నెల ప్రశ్నకు జవాబులు :

1వ ప్రశ్నకు జవాబు

ఒక సంవత్సరం పదకొండు రోజులు

**(17-02-600 నుండి 27-02-601 వరకు)**

2వ ప్రశ్నకు జవాబు

ఐదుసార్లు

(నిర్గ. **19:3,19:20,19:21,24:13,32:31**)

ప్రయత్నించినవారు :
పి.జె.సత్యవాణి, తెనాలి
సత్యవతి జాకబ్, నెల్లూరు
బత్తుల ఆనీమేరి, హైదరాబాదు
బి.ఎ. లాజరస్, నిడదవోలు

## STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS OF HANNA KRUPA MONTHLY

| | | |
|---|---|---|
| 1. | Place of Publication | : ONGOLE |
| 2. | Periodicity of its Publication | : Monthly |
| 3. | Printer's Name | : K. E. Rajendra |
| | (Whether Citizen of India) | : Indian |
| | Country of Origion/Address | : 5th Lane, Cloughpet, Ongole - 523 001 |
| 4. | Publisher's Name | : K. Samuel Rajendra |
| | (Whether Citizen of India) | : Indian |
| | Country of Origion/Address | : Krupadanam Street, Cloughpet, Ongole - 523 001 |
| 5. | Editor's Name | : K. Samuel Rajendra |
| | (Whether Citizen of India) | : Indian |
| | Country of Origion/Address | : Krupadanam Street, Cloughpet, Ongole - 523 001 |

I, K. Samuel Rajendra hereby declares that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 25-3-2008

(Sd.) ***K. Samuel Rajendra***
Signature of the Publisher

సీరియల్

# అత్యంత ప్రియమైన అమ్మ

**(దేవుని బలిష్టమైన చేతిలో దీనపాత్ర కీ.శే. శ్రీమతి వై.యస్. జయమ్మ)**

## పరిచయము

ప్రపంచంలో నిజాయితీ గలిగిన ఏ నాయకుడైనా తన చిన్నతనంలో తల్లి వలన మలచబడిన వాడే. పెద్దవుతూ వున్నప్పుడు పుస్తకాల పురుగులు పెద్దయిన తర్వాత సరైన నిజాయితీగల నాయకుని శిష్యుడు తర్వాత నిజాయితీ గలిగిన నాయకుడు.

నాలుగు సంవత్సరాల క్రితం ఒంగోలులో ప్రాణదాత పత్రిక సభ్యులు సువార్త కూడికలు ఏర్పాటు చేసి కన్వీనరుగా నన్ను ఉండమన్నప్పుడు అయిష్టంగానే ఒప్పుకున్నాను. అప్పుడు పరిచయమైన దైవవర్తమానికులు యు. సాల్మన్‌గారి సాక్ష్యము హన్నాకృపలో ప్రచురించాను. వారి సాక్ష్యములో మొదటిసారి జయమ్మగారి ఆధ్యాత్మికస్థితిని గురించి, ఆమె కుటుంబ జీవితము గురించి వ్రాశాము.

ముఖ్యమంత్రి డా॥ రాజశేఖర్‌రెడ్డిగారు పదవి చేపట్టిన క్రొత్తలో వారి మాటల మధ్యలో 'దేవుడు' అనే మాట పలుమార్లు పలకటంలో ఆయన తల్లిగారి పెంపకం కనిపించింది. (ప్రస్తుతం ఆయన దేవుడు అనే మాటకు బదులుగా 'భగవంతుడు' అనే పదము వాడుచున్నారు.)

2008 మార్చి 5న డా॥ పురుషోత్తమరెడ్డిగారి ఇంట్లో వున్నప్పుడు ఆయన 'అత్యంత ప్రియమైన అమ్మ' అనే పుస్తకం నాకిచ్చారు. అదంతా చదివిన తర్వాత వారిని 'హన్నాకృప'లో ప్రచురించమంటారా? అని అడిగినప్పుడు ఆయన సంతోషంగా అంగీకరించారు.

యెదుగురు సందింటి వెంకటరెడ్డిగారు యేసు ప్రభువును తన స్వంత రక్షకునిగా స్వీకరించి ప్రతి దినము తన శిలువను ఎత్తుకొని యేసును వెంబడించినందున ఆయన పదిమంది సంతానమును...

'యెహోవాయందు భయభక్తులు గలవారి మీదను ఆయన కృప యుగయుగములు నిలుచును. ఆయన నీతి వారికి పిల్లపిల్ల తరమున నిలుచును' అనే వచనము నెరవేర్చబడినది. ఈ పుస్తకము చదివిన తర్వాత జయమ్మగారికి దేవుడిచ్చిన వాగ్దానము నెరవేర్పు. ఆమె యొక్క సంతానము దీవించబడిన తీరులో బయలుపరచబడినది.

గుంటూరు కన్నావారితోటలోని ఎల్‌షద్దాయి సంఘ కాపరి రెవ. డా॥ మూరతోటి సంపత్ శాంతవర్ధన్‌గారి ద్వారా కడపవాసి శ్రీ మూర్తోటి మైఖేల్ విజయకుమార్‌గారి సాక్ష్యము హన్నాకృపలో ప్రచురించిన తర్వాత యెదుగురి సందింటి (వై.ఎస్.) కుటుంబములోని ఎక్కువమంది సాక్ష్యము హన్నాకృపలో ప్రచురమయ్యాయి. వారి సంబంధికులందరికి గత నాలుగు సంవత్సరాలుగా 'హన్నాకృప' పంపబడుతున్నది.

పులివెందులలోని రాజారెడ్డి ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గారైన వై.ఎస్. పురుషోత్తమరెడ్డిగారు వారి కుమారుడు థామస్‌రెడ్డిగారిచే హన్నాకృప ఆఫీసు అనేక హంగులు సంతరించుకొన్నది. పురుషోత్తమరెడ్డిగారి పెద్దకోడలు డా॥ సరోజిని, రెండవ కోడలు డా॥ అనురాధ తమ అనుదిన ప్రార్థనలలో హన్నాకృపను ఆదరిస్తున్నారు.

అత్యంత ప్రియమైన అమ్మ అనే పుస్తకమును సిద్ధపరచుట ద్వారా వారి కుమార్తె విమలారెడ్డిగారు, జయమ్మగారిని చూడలేక పోయాను అన్న భావన నుండి నన్ను తప్పించారు. వారికి నా హృదయపూర్వక అభినందనలు. శ్రీమతి విమలారెడ్డిగారు ప్రభువు రాజ్యసేవకై వారు చేస్తున్న సేవను ఆశీర్వదించునుగాక!

**-కొడవటికంటి**

## అమ్మ స్మృతులతో....

ముఖ్యమంత్రిగా నేను ఎన్నో పుస్తకాలు ఆవిష్కరించాను గాని నా చెల్లి వ్రాసిన మా అమ్మ జీవిత చరిత్ర ఆవిష్కరించడం పూర్తిగా ఒక భిన్నమైన అనుభవం. నేను నా తమ్ముళ్ళు మరియు చెల్లెలితో కలిసి ఏకస్వరంతో చెప్పే విషయం ఏమిటంటే మేమంతా ఆమె పిల్లలమైనందుకు గర్వపడుచున్నాము.

మా అమ్మ మమ్ములనందరిని దైవమార్గంలో పెంచింది. బైబిలు చదువుకోవాలని, ఉదయం మరియు సాయంత్రం ప్రార్థన చేసుకోవాలని, క్రమంగా మందిరానికి వెళ్ళాలని నేర్పించింది. జీవితంలోని విలువలన్నీ మాకు బోధించింది. భక్తిగల మా అమ్మ పెంచటం వలన మేము క్రమశిక్షణ, కష్టపడి పనిచేసే స్వభావం, దీనత్వం, తోటి మానవుల పట్ల కనికరం, దాతృత్వం మరియు నాయకత్వ లక్షణాలు నేర్చుకున్నాము.

అమ్మ మాతో ఈలోకంలో ఉన్నంతకాలం మేము ఆమె

ప్రార్ధనల మీద ఆధారపడినాము. నేను ముఖ్యమంత్రి కావాలని ఆమె ఎంతో ప్రార్ధన చేసింది. నేను వేసవి ఎఱ్ఱని ఎండలో రాష్ట్రమంతటా పాదయాత్ర చేస్తున్నప్పుడు అమ్మ నా గురించి ఎంతో భారంతో ప్రార్ధన చేసింది. ప్రభువు పాదసన్నిధిలో యింకా అమ్మ మా గురించి ప్రార్ధన చేస్తూనే వుందని మా నమ్మకం. ప్రభువు నుండి పాఠకులకందరికీ ఆశీర్వాదాలు కలగాలని మనసారా కోరుతున్నాను.

**డా॥ వై.యస్.రాజశేఖర్‌రెడ్డి**
ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

## ముందు మాట

క్రీ.శ. 1946 సంవత్సరంలో నా చిన్న అన్న శ్రీ వై.ఎస్.రాజారెడ్డి మా మేనత్త కుమార్తె జయమ్మను వివాహం చేసుకున్నాడు. ఆమె తన వివాహం అయిన తరువాత కూడ తన చదువును పులివెందులలో కొనసాగించి, ఎస్.ఎస్.సి. చివరి పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది.

నా అన్న రోడ్లు మరియు భవనాల కాంట్రాక్టు పని, గనుల నిర్వహణ బాధ్యతలతో పాటు రాజకీయాల్లో నిమగ్నమై వుండేవాడు. అయితే శ్రీమతి జయమ్మ, తన తల్లి సహాయంతో తన పిల్లల చదువు, వ్యవసాయం మరియు పని వారిని చూసుకునేది. ఆ విధంగా ఆదర్శమైన గృహిణిగా, అనేకులకు మాదిరిగా వుండేది. ఆమె కుటుంబం ఏ విధమైన సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ, ఆమె క్షమాపణ గురించి నొక్కి చెప్పేది. కీడుకు ప్రతిగా ప్రేమను నెలకొల్పేది.

ఆమె మంచి ఆతిథ్యమిచ్చే గృహిణిగా, స్త్రీల సహ వాసంలో నాయకురాలిగా, లయన్స్ క్లబ్‌లో నిర్మాణాత్మక కార్య కలాపాల్లో పాలిభాగస్తురాలిగా, పంచాయితీ అధ్యక్షురాలిగా, వై.ఎస్.వైద్యట్రస్టు సేవానిర్వాహకురాలిగా అనేక కార్యకలాపాల్లో పాల్గొని సమాజానికి సేవ చేసింది.

1995వ సంవత్సరంలో శ్రీమతి జయమ్మకు మెదడులో రక్తప్రసరణ లోపం వచ్చిన కారణంగా నూఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఆసుపత్రికి తీసుకొని వెళ్ళారు. అప్పటి వైద్యము వలన శరీరం బలహీనపడినప్పటికీ, ఆమె విశ్వాసంలో బలపడింది. దేవుని పని చేయుటలో ఎంతో ఉత్సాహం కనపరచింది. అయితే, శ్రీమతి జయమ్మకు రెండవసారి వచ్చిన మెదడులో రక్తప్రసరణ లోపం ఆమె మరణానికి కారణమైంది. ఇది ప్రభువు కార్యం. ఆయన తన సమయంలో తన కుమార్తెను తన మహిమలోకి పిలుచుకున్నాడు.

శ్రీమతి జయమ్మ అనుసరించిన బైబిలు వచనం, హెబ్రీయులకు 13:7 చదువరులు గ్రహించాలని నా దీన విన్నపం. **"మీకు దేవుని వాక్యము బోధించి, మీపైని నాయకులుగా ఉన్నవారిని జ్ఞాపకము చేసికొని, వారి ప్రవర్తన ఫలమును శ్రద్ధగా తలంచుకొనుచు, వారి విశ్వాసమును అనుసరించుడి".**

శ్రీమతి జయమ్మ జీవితం మనందరికీ ఆదర్శం. **"నీతిమంతుని జ్ఞాపకము చేసికొనుట ఆశీర్వాదకరం"** సామెతలు 10:7.

**డా॥ ఎస్.పురుషోత్తమ రెడ్డి,** ఎం.ఎస్.డి.ఒ
మాజీ శాసన సభ్యులు, పులివెందుల

## ప్రార్ధన

కృపగల మా పరలోకపు తండ్రీ, భక్తిగల జీవితం జీవించి, తన జీవితాంతం నీ ప్రశస్తమైన నామాన్ని మహిమ పరచిన తల్లి గర్భాన నాకు జన్మ యిచ్చినందుకు నీకు కృతజ్ఞతలు. ఈ పుస్తకంలో వ్రాయబడిన విషయాలు పాఠకులు అర్ధం చేసుకొనుటకు, గ్రహించుటకు వారిని నీ పరిశుద్ధాత్మతో నింపండి ప్రభువా. ఓ దేవా! పాఠకులందర్నీ ఆశీర్వదించండి. మా అమ్మ తన జీవితాంతం నిన్ను మహిమ పరచిన విధంగా, వారు ఆమెను మాదిరిగా తీసికొని నిన్ను మహిమపరచుటకు సహాయం చేయండి. మా అమ్మవంటి ప్రజలతో లోకం నింపబడినప్పుడు నీ రాజ్యము భూమి మీద చూడగలుగుతాము, నీ అద్భుతమైన సన్నిధిని నిత్యము మేము అనుభవించ గలుగుతాము. ఈ ప్రార్ధన మా ప్రభువును, రక్షకుడైన యేసుక్రీస్తు ప్రశస్త నామంలో ప్రార్ధిస్తున్నాను తండ్రీ, ఆమెన్.

## తొలిపలుకులు

క్రైస్తవ్యం ఒక మతంకాదు. ఇది దేవునితో వ్యక్తిగత సంబంధమును నెలకొల్పే 'జీవ మార్గం'. లౌకిక రాజ్యమైన భారతదేశంలో అనేకమైన దేవుళ్ళు మరియు దేవతలు వున్నారని భావిస్తారు. దుష్టులను (పాపాత్ములను) శిక్షించుటకు నీతిమంతులను రక్షించుటకు వీరందరు ఈ భూమి మీదకు వచ్చారని చెప్తారు. అయితే యేసుక్రీస్తు పాపులను రక్షించుటకు ఈ లోకానికి అరుదెంచాడు. మన పాపముల నిమిత్తం సిలువ మీద తన ప్రాణాన్ని అర్పించాడు. బైబిల్లోని ఒక సుప్రసిద్ధ వాక్యభాగాము దేవుని ప్రేమను గురించి యీలాగు తెలియజేస్తుంది **"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు**

**ఆయనను అను[గ్రహించెను"** (యోహాను 3:16).

దేవుడు మానవజాతి సృష్టికర్త కాబట్టి ఆయన మానవు లందరికి తం[డి. మనం మన పిల్లలను [పేమిస్తాం. లోక మాలిన్యము నుండి, బాధల నుండి వారిని కాపాడుటకు మనం చేయగలినదంతా చేస్తాం. వారు నశించిపోవాలని ఎన్నడూ కోరుకోం. ఇహలోక తల్లిదం[డులైన మనం మన పిల్లలపట్ల అంత బాధ్యత కలిగి వుంటే, మన పరలోకపు తం[డి మన గురించి ఎంతగా బాధ్యత కలిగి వుంటాడో మనం అర్థం చేసుకోవాలి. ఆయన మనలను రక్షించి తన కాపుదలతో భ[దపరిచే దేవుడు. ఏ ఒక్కరూ నశించిపోవాలని ఆయన కోరుకోవడం లేదు. బైబిలు బోధించే అద్భుతమైన సత్యమిదే.

దేవుని హస్తాలకు మనం అప్పగించుకున్నప్పుడు, ఆయన మనలను సంపూర్ణంగా లక్ష్యపెడతారు. **"కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి అప్పుడవన్నియు మీకను[గహింపబడును"** అని మత్తయి 6:33లో [వ్రాయ బడింది. 'అవన్నియు' అనే మాటలో సుగుణం, ఆరోగ్యం, ఐశ్వర్యం మరియు సంతోషం కలిగి వున్నాయి.

ఈ పుస్తకం అమ్మ యొక్క సంపూర్ణ జీవిత చరి[త కాదు కానీ ఆమెను గురించిన నా జ్ఞాపకాలు మరియు అనుభవాలు మీ అందరితో పంచుకొనుటకు ఎన్నుకొన్న మార్గం. ఆమె నిజమైన [కైస్తవ జీవితం జీవించి అందరికీ సాక్షిగా నిలిచింది. ఆమె జీవిత విధానం, కుటుంబస్తులతోను, బయట వారితోను ఆమెకున్న సంబంధ బాంధవ్యాలు, అతి [పాముఖ్యంగా తన [పభువుతో ఆమె కలిగియున్న శాశ్వత సహవాసం అనే అంశాలను [గంథస్తం చేయటం ద్వారా నా హృదయపూర్వక నివాళిని నా తల్లికి సమర్పిస్తున్నాను. దేవుని [పేమను ఆమె అందరికీ సమానంగా పంచారు. ఆమె ఎడతెగని [పార్థనలు మా కుటుంబానికి కోటగా నిలిచాయి. ఆమె మాదిరికరమైన జీవితాన్ని బట్టి యేసు[కీస్తును మేమందరము సొంత రక్షకునిగా అంగీకరించాము. ఆ కారణాన్నిబట్టే ఈ దినాన మేమెంతో ఆశీర్వదించబడ్డామని చెప్పగలను.

**"అత్యంత [పియమైన అమ్మ"** అనే పేరు ఈ పుస్తకానికి ఎందుకు ఎనుకున్నానంటే మాకు, మా పిల్లలకు మా[తమే గాక ఆమెతో పరిచయమున్న [పతి ఒక్కరికి ఆమె [పియమైన వ్యక్తి. ఆమె మాతృత్వానికి నిజమైన మాదిరి, సర్వశక్తుడైన దేవునిచే ఆమె ఏ విధంగా వాడబడిందో తెలియజేయడానికి "దేవుని బలిష్ఠమైన చేతిలో దీనపా[త" అనే ఉపశీర్షికను కూడ ఈ పుస్తకానికి పెట్టాను.

**"సాత్వీకులు ధన్యులు; వారు భూలోకమును స్వతం [తించుకొందురు"** అని మత్తయి 5:5లో యేసు[కీస్తు ఈ మాటలు సెలవిచ్చాడు. నేను ఈ వచనాన్ని చదివినప్పు డెల్లా నా మనసులో ఆమె ముఖం దర్శనమవుతుంది.

అనేకమందికి [పోత్సాహకరంగా వుండునట్లు ఈ పుస్తకం [వ్రాయడానికి దేవుడు యిచ్చిన జ్ఞానాన్నిబట్టి, నడిపింపును బట్టి ఆయనకు లెక్కలేనన్ని వందనాలు చెల్లిస్తున్నాను. ఈ పుస్తకం [వ్రాయుటలో మా కుటుంబ సభ్యులు అందించిన [పోత్సాహం [పార్థనా సహకారముల నిమిత్తం వారందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పుస్తకం ము[దణకావించబడి [పజలకు అందుబాటులోకి తెచ్చుటకు తోడ్పడిన కార్యనిర్వాహక సభ్యులకు కూడ నా వందనాలు తెలియజేస్తున్నాను.

**-బి.విమలారెడ్డి**

([శీమతి వై.యస్.జయమ్మ రాజారెడ్డి కుమార్తె)



# సువార్తలలోని యేసు కథ

77

వాళ్ళు 'అది సరే కాని, నీవెవరవు?' అని అడిగారు. అందుకు యేసు 'నేను ఇంతదాక ఎవర్నని చెపుతున్నానో ఆయననే. నేను మీ తీర్పు విషయంలో ఎన్నో సంగతులు చెప్పగలను. కాని దానికి మారుగా నన్ను పంపిన వాని నుండి విన్నవాటిని మాత్రమే ప్రపంచానికి చెబుతున్నాను. ఆయన నమ్మదగిన వాడు' అని అన్నాడు.

ఆయన తన తండ్రిని గురించి చెపుతున్నాడు. వాళ్ళు అర్థం చేసికోలేదు. అందువల్ల యేసు వాళ్ళతో 'మనుష్య కుమారుని పైకి లేపినప్పుడు నేనే ఆయనని మీరు తెలుసు కుంటారు' అని బహు సౌమ్యంగా అన్నాడు. మరల కొంచెం సేపు ఆగి అందరినీ చూశాడు. వాళ్లందరి ముఖాల్లో అసహనం కనిపిస్తుంది. వాళ్లకు ఏమీ అర్థం కావటం లేదు. మరలా ఏమి చెప్పబోతున్నాడో అని ఎదురు చూస్తున్నారు. 'స్వతహాగా నేనేమీ చెయ్యనని, నా తండ్రి బోధించిన వాటిని మాత్రమే చెపుతానని తెలుసుకుంటారు. నన్ను పంపిన వాడు నాతో వున్నాడు. నేను ఎల్లవేళలా ఆయనకు ఇష్టమైనవే చేస్తుంటాను. కనుక ఆయన నన్ను ఒంటిరిగా వదలి వేయడు' అన్నాడు యేసు. ఆయన చెప్పినది అర్థంకాక వెంటనే కొందరు వెళ్లిపోయారు. అయితే చాలామంది ఈ మాటలు విని ఆయనను విశ్వసించారు. అటువంటి వారిని ఆయన ఎరుగును. ఆయన నేరుగా మనుష్యుల హృదయాల లోనికి చూచేవాడు గనుక వారితో 'మీరు నా బోధనలు పాటిస్తే మీరు నా నిజమైన శిష్యులు. అప్పుడు మీరు సత్యాన్ని గురించి తెలుసుకుంటారు. ఆ సత్యము మీకు స్వేచ్ఛ కలిగిస్తుంది' అన్నాడు యేసు.

వారిలో ఒకడు ముందు వచ్చి 'మేము అబ్రాహాము సంతానము. మేమింతవరకు ఎవరికిని బానిసలుగా వుండలేదు. మరి మీకు స్వేచ్ఛ కలుగుతుందని ఎందుకు అంటున్నావు' అన్నాడు. 'అది నిజమే కాని పాపము చేసిన ప్రతి వ్యక్తి ఆ పాపానికి బానిస అవుతాడు. బానిసకు కుటుం బములలో శాశ్విత స్థానము వుండదు. కాని కుమారుడు శాశ్వతముగా ఆ యింటికి చెందిన వాడవుతాడు. కుమారుడు స్వేచ్ఛ కలిగిస్తే మీకు నిజమైన స్వేచ్ఛ కలుగు తుంది' అని చెప్పి మరలా అందరి వైపు చూసి 'మీరు అబ్రాహాము సంతానమని నాకు తెలుసు. అయినా మీకు నా బోధ నచ్చలేదు. అందుకే నన్ను చంపటానికి ప్రయత్నం చేస్తున్నారు. నేను నా తండ్రి సమక్షంలో చూచిన దానినే చెపుతున్నాను. మీరు మీ తండ్రి నుండి విన్నదానినే చేస్తున్నారు' అన్నాడు యేసు.

వెంటనే గుంపులో కలకలం ప్రారంభమైంది. వారిలో ఒకడు 'నీవు సమరయుడివి, నీకు దయ్యం పట్టిందని మేము అనటంలో నిజం లేదా?' అన్నాడు. అందుకు యేసు ఏమి లెక్క చెయ్యలేదు. 'నాకు దయ్యం పట్టలేదు. నేను నా తండ్రిని గౌరవిస్తాను. మీరు నన్ను అగౌరవపరుస్తున్నారు. నేను నా కీర్తిని కోరటం లేదు గాని నా కీర్తి కోరేవాడు ఒకాయన వున్నాడు. ఆయనే న్యాయాధిపతి' అని ఆగి తనకెదురుగా వున్న వానిని చూస్తూ 'నా బోధననుసరించే వాడు ఎన్నటికీ చావు చూడడు' అన్నాడు.

వెంటనే గుంపులో నుండి 'నీకు దయ్యం పట్టిందని మాకిప్పుడు తెలిసింది' అని పెద్దగా అరచి ' నీవు మా తండ్రి అబ్రాహాము కంటే గొప్ప వాడవా? అబ్రాహాము చనిపోయాడు. అలాగే ప్రవక్తలూ చనిపోయారు. అయినా నీ బోధను అనుసరించే వాడు చనిపోడని అంటున్నావు' అన్నాడు. మరొకడు 'నీ మనసులో నీవెవరనుకుంటున్నావు?' అన్నాడు.

'నన్ను నేను పొగడుకుంటే ఆ పొగడ్తకు అర్థంలేదు. నన్ను పొగడే వాడు నా తండ్రి. ఆయన మీ దేవుడని మీరంటున్నారు. ఆయన మీకు తెలియదు. కానీ, నాకాయన తెలుసు' అని కొంచెం ఆగి 'ఆయన నాకు తెలియదని నేనంటే నేను మీతో అబద్ధమాడినట్లు అవుతుంది. కాని ఆయన నాకు తెలుసు. ఆనయ మాట నేను పాటిస్తాను' అని అబ్రాహాము సంతానము అన్న వాని వైపు చూచి 'మీ తండ్రి అబ్రాహాము నా కాలమును చూడగలనని గ్రహించిన వెంటనే ఆనందపడ్డాడు. అతడు చూచాడు, ఆనందపడ్డాడు' అని నిశ్చయముగా అన్నాడు.

'నీకింకా యాభై సంవత్సరాలైనా నిండలేదే. నువ్వు అబ్రాహామును చూశావా' అని పెద్ద వయస్సున్న శాస్త్రి. 'అబ్రాహాము పుట్టకముందే నేను ఉన్నాను. ఇది నిజం' అన్నాడు యేసు.

(సశేషం)

# ప్రార్థనా కొండ

1999 నుండి ప్రతిరోజూ ఉదయం 4-30 గంటలకు మందిరంలోనికి వచ్చి 5-30 వరకు వాక్యము బోధించటం ప్రారంభించాను. ఒకరోజు ఉదయం 6 గంIIకు మందిరం వెలుపల కూర్చుని వుంటే కొండ క్రింద వున్న జక్కరయ్య నగర్ నివాసి కిషోర్ వచ్చి 'మీ కుమారుడు నతనయేలు ఊర్లో లేరా?' అని అడిగాడు. 'లేదు, ఎందుకు?' అని అడిగాను. 'ప్రతి ఆదివారం కొండ మీద వున్న చిన్న మందిరంలో నుండి మీ అబ్బాయి చెప్పే వాక్యం వినేవారము' అన్నాడు.

పగలు కొండమీద నుండి వచ్చే వాక్యము ఒంగోలు ప్రజలు వింటుంటే వేకువ జామున అందరూ నిద్ర లేచే సమయంలో కొండమీద నుండి వాక్యము చెప్తే చాలామంది వింటారు కదా అని ఒక రోజు ఉదయం నాలుగు గంటలకు ప్రార్థనా కొండ ఎక్కి పరీక్షించాను. ప్రక్కనే వున్న వెంకటేశ్వర స్వామి గోపురము నుండి ఉదయం 5-15 గంటలకు సుప్రభాతం పెట్టారు. కనుక ప్రతిరోజు ఉదయం నాలుగు గంటలకు కొండ ఎక్కి 4-45 నుండి 5-15 వరకు వాక్యము చెప్పటం ప్రారంభించాను. అలా రెండు సంవత్సరాలు చెప్పాను.

ఒకరోజు ఉదయాన్నే 8 గంటలకు బజారులో వెళ్తూ చాలా నిరుత్సాహంగా నడుస్తూ ఇన్ని సంవత్సరాలు వాక్యం చెప్పాను. వాక్యం ఫలించిన దాఖలాలు ఏవీ లేవు కదా అనుకుంటున్నాను. వెనుక నుండి ఎవరో చప్పట్లు కొడుతూ పిలుస్తున్నారు. ఆగి వెనుకకు చూశాను. బ్రదర్ భక్తసింగ్ ఫెలోషిప్ జయరావుగారు కనిపించారు. ఆయన నాకు 40 సంవత్సరాలుగా పరిచయం. దగ్గరకు వచ్చి 'ఇప్పుడు మీరేం చేస్తున్నారు, సేవ చేస్తున్నారా?' అని అడిగాడు. 'ప్రతిరోజు ఉదయం నేను కొండమీద వాక్యం చెప్తున్నానుగా' అన్నాను. 'మీ సాక్ష్యము ఒకటి విన్నాను'అన్నాడు. 'చెప్పండి' అని ఆగాను.

ప్రక్కనే వున్న పెద్ద గోడను చూపిస్తూ '40 సంవత్సరాల క్రితం మీరు ఈ గోడమీద దేవుని వాక్యము వ్రాశారు కదా, మీరు వారం రోజుల పాటు ఈ గోడ మీద వ్రాస్తున్నప్పుడు దండల లింగయ్య అనే యౌవవస్తుడు అది చదివి మీ దగ్గర బైబిలు తీసికొని చదివి ఇప్పుడు ఒక గొప్ప సంఘానికి కాపరిగా వున్నాడు. ఆయన కుమారులందరు సేవలో వున్నారు' అన్నాడు. మనం చేసిన సేవ ఏనాటికైనా ఫలిస్తుంది అని సంతోషించాను.

హన్నాకృప పత్రిక ప్రారంభించిన తర్వాత ప్రయాణాలు ఎక్కువ అయినందున కొండమీద ఉదయం వాక్య పరిచర్య కొనసాగించలేకపోయాను. కాని ప్రతి ఆదివారం ఆరాధన జరిపేవాడిని. రెండు సంవత్సరాలు అలా గడచినా 12, 13 సంవత్సరాల పిల్లలు తప్పితే పెద్దవారెవరూ ఆరాధనకు రాలేదు. హన్నాకృప పరిచర్య విస్తరించినందున ఆదివారాలలో కూడ కొండమీదకు వెళ్ళలేకపోయాను. నా చిన్న కుమారుడు నతనయేలు ఆ బాధ్యత తీసుకున్నాడు రాత్రింబవళ్ళు అక్కడ సేవ సాగించనారంభించాడు. అంత సేవకి అక్కడ ఎవరున్నారు. అనవసరంగా కష్టపడుతున్నాడేమో అనుకొనేవాడిని.

ఒకరోజు ఆదివారం నతనయేలు హైదరాబాదు వెళ్తూ నన్ను చర్చిలో వాక్యం చెప్పమన్నాడు. ఆ చిన్న చర్చినిండా పెద్దవారున్నారు. ఆశ్చర్యపోయాను, సంతోషించాను. పోయిన సంవత్సరం క్రిస్మస్ వేడుకలు జరిపించినప్పుడు జిల్లా వైద్యాధికారి సోనార్‌బాబుగారు హాజరయ్యారు. 20 మంది యువతీయువకులు ఆ సంఘములో గట్టి పట్టుదలతో వాక్యపరిచర్యలో పాల్గొంటున్నారు.

మే నెలలో ది అన్‌డినామినేషనల్ చర్చ్ ఆఫ్ ది లార్డ్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు నతనయేలు ప్రారంభించినప్పుడు గుంటూరు నుండి రెవ.డాII.శాంతవర్ధన్‌గారిని ఆహ్వానించి ఘనంగా సభను నిర్వహించారు. ఆ సభలో నా భార్య శాంతవర్ధన్‌గారితో మీరు కొండమీద వున్న చిన్న సంఘములో ఒకరోజు వాక్యము చెప్పాలని అడిగింది. ప్రార్థించండి అన్నారు.

ఫిబ్రవరి 7 శాంతవర్ధన్‌గారి 37వ పెండ్లిరోజు సందర్భముగా నా భార్య సావిత్రితో కలిసి గుంటూరు వెళ్ళాము. ఒంగోలు కొండ మీద ఆ గుడిసెల మధ్యలో ఒక ప్రార్థన కూటము ఏర్పాటు చేస్తాము, మీరు వచ్చి వాక్యము చెప్పాలని మరలా శాంతవర్ధన్‌గారిని అడిగాము. అప్పుడు ఆయన మార్చి 12న వస్తామన్నారు. వేలకొలది జనసమూహము మధ్యను, టి.వి.లోను వాక్యము చెప్పే శాంతవర్ధన్‌గారు ఒక వందమందికి వాక్యము చెప్పటానికి గుంటూరు నుండి ఆయన ఖర్చుతో, ఆయన వాహనములో రావటం నాకు ఆశ్చర్యం కలిగించింది.

కొండమీద వాక్య పరిచర్య ఒక్క రాత్రి మాత్రమే అయినప్పటికీ అక్కడి సంఘస్తులు, యౌవనస్తులు వారం రోజులు రాత్రి పగలు కష్టపడి 500 మంది కూర్చోగల ఖాళీస్థలమును తయారు చేశారు. ఇంత స్థలంలో కూర్చోడానికి జనాన్ని ఎక్కడి నుండి తెస్తారు అనుకున్నాను. నెల్లూరు నుండి రాజకుమారిగారి తమ్ముడు అశోక్ కొంత ధనసహాయం పంపించారు. కొండమీద నివాసమున్న సంఘస్తులే తమ లేమిలో తమకు కలిగినదంతయు వెచ్చించి సభను ఏర్పాటు చేశారు.

12వ తేదీ సాయంకాలం శాంతవర్ధన్‌గారు ఆయన కుమారుడు జేకె గారు మరి పదిమందితో తన వాహనంలో ప్రయాణంచేసి 8 గంటలకు స్టేజీమీదకు వచ్చారు. జె.కె.గారు సాధన చేసిన సంగీత సాధనం ఒక్కటే 12 రకాల వాయిద్యాలను ప్రతిభింబిస్తుంది. దానిని ఆయన ఒక్కడే సాధనము చేసినా స్టేజీమీద సిద్ధము చేయటానికి ముగ్గురు మనుష్యులు అరగంట శ్రమించారు.

నతనయేలు అనేక కార్యక్రమాలు ఆ స్టేజీమీద ఆ సమయంలో ఏర్పాటు చేసినప్పటికీ రెండు పాటలు పాడిన తర్వాత శాంతవర్ధన్‌గారు వాక్యపరిచర్యలో ప్రవేశించి పదిన్నరకు ముగించిన తర్వాత రోగుల కొరకు ప్రార్థించారు. ఒంగోలులో డా॥ జకరయ్యగారి దగ్గర 1957 నుండి కంపౌండర్‌గా పనిచేసిన దొరైస్వామిని నేటి ముఖ్యమంత్రి డా॥ రాజశేఖర్‌రెడ్డిగారు పులివెందులలో తన దగ్గర కంపౌండర్‌గా పనిచేయుటకు తీసికొని వెళ్ళాడు. ఆయన రాజకీయాలలోనికి వెళ్లిన తర్వాత దొరైస్వామి అస్వస్థతకు గురై నేటికి 15 సంవత్సరాలుగా నడక, మాట లేకుండా వున్నారు. ఆరోజు ఆయన తన భార్యతో కలసి కొండమీద జరుగుతున్న మీటింగుకు హాజరయ్యారు.

మీటింగ్ ముగించిన తర్వాత ఇద్దరు వ్యక్తులు ఆయనను ఇరువైపుల పట్టుకొని స్టేజిమీద వున్న శాంతవర్ధన్‌గారి వద్దకు తీసికొని వస్తుండగా 20 అడుగుల దూరంలో ఉండగా వారిని ఆగిపొమ్మని చెప్పారు. ఆయనను తీసికొని వస్తున్న మనుష్యులను ఆయనను వదలి దూరంగా వెళ్ళమని చెప్పారు. తర్వాత శాంతవర్ధన్‌గారు దొరైస్వామి కొరకు ప్రార్థించి, ఆయన వైపు చూచి "నన్ను చూస్తూ నడవండి, క్రిందికి చూడవద్దు" అని చెప్పాడు. 15 సంవత్సరాలుగా నడవని దొరైస్వామి నడచుకుంటూ శాంతవర్ధన్‌గారి వద్దకు వెళ్ళాడు. అప్పుడు శాంతవర్ధన్‌గారు ఆయనతో "నోరు తెరచి హల్లెలూయా అని పెద్దగా అరువు" అని చెప్పారు. అప్పుడు దొరైస్వామి "హల్లెలూయా" అని స్పష్టంగా అరిచాడు.

సభకు హాజరైన వారినందరిని చూచి నేను నాతో పాటు గుంటూరు నుండి వచ్చిన సహోదరులు కూడ ఆశ్చర్యపోయారు. ఆరు సంవత్సరాల సేవ ఫలింపును ప్రభువు యొక్క కృపను, ఆశీర్వాదమును కన్నులారా చూచి నేను ప్రభువును స్తుతించాను. ఆయన నమ్మదగిన దేవుడు.

---

8వ పేజీ తరువాయి....)

మధుర స్వప్నాల మందిరాన్ని కుప్పకూల్చుతా. ఇక, ఈ మానవాళి నీ సొత్తు కాదు, నీ వారసులంతకన్నా కాదు. వారు... కేవలము నా పాద దాసులు. నీ బద్ధ శత్రువులు (వికృత నవ్వు).

**యెహోవా :** ఘటసర్పమా! అబద్ధికుడా!! మదాందుడా!!! ఏమీ నీ గర్వము? నీ వికృతాశయము నా ప్రియ సంతానము, నా రాజ్యవారసులు, నా సింహాసన పాలిభాగస్తులు, నరజాతిని నీ వశముజేసి నీ ఆధిపత్యాని కప్పగిస్తాననియా నీ దురాలోచన? మోసగాడా! అది ఎన్న టెన్నటికి జరుగదని తెలిసికో. నీ కలలు కల్లలుగా చేస్తాను.

నా మహిమను నేనెవరికిచ్చు వాడనుగాను. నేను రోషముగల దేవుడను. నేను భీకరుడైన దేవుడను. నేను భయంకరుడైన దేవుడను. అంతియేగాక, నేను ప్రేమగల దేవుడను. నేను కృపామయుడైన దేవుడను. నేను కరుణా మయుడైన దేవుడను. నేను దయాదాక్షిణ్య పూర్ణుడను. నేను వాత్సల్యతగల వాడను.

మానవుడు చేసిన అపరాధము, పాపము పరిహరింపబడతాయి. నా బిడ్డల దోషముల విషయములో జాలి కలిగి, పాపక్షమాపణ నిమిత్తము 'బలి'యర్పణ చేయబడుతుంది. రక్తధారలతో వారి పాపములకు ప్రాయశ్చిత్తము చేస్తాను. పాపము మీదను విజయము చేస్తాను. మర్త్యులైన నరులను శాశ్వత జీవనముతో నింపుతాను. ఆ రక్షణకు గుర్తుగా యిప్పుడే 'రక్తము' చిందించి ఆదాము హవ్వలకు చర్మము చొక్కాయిలను తొడిగిస్తాను. (ఆదికాండము 3:21).(ఈ రక్షణ కార్యమును భరించలేక సాతాను దైవ సాన్నిధ్యము వీడును) – ఆమేన్.

**– జెడ్.సి.దేవదానం, కర్నూలు**

# North East West South వార్తలు

## చిత్తూరులో క్రైస్తవులపై దాడి

ఫిబ్రవరి 24, చిత్తూరు : చిత్తూరు జిల్లా గురబలకోట మండలంలోని అంగళ్లు గ్రామ సమీపంలో వున్న ఒక దళితవాడలో సువార్తికులపై ఆరెస్సెస్, బి.జె.పి., విశ్వహిందూ పరిషత్‌లకు చెందిన గూండాలు మూకుమ్మడిగా దాడిచేసి దారుణంగా కొట్టడం జరిగింది. ఆ తర్వాత గాయపడిన సువార్తికులను పోలీసులకు అప్పగించారు. ఈ దారుణ సంఘటన గత ఫిబ్రవరి 24వ తేదీన జరిగింది. అంగళ్లు సమీపంలోని పెద్ద దళితవాడలో సువార్త ప్రచారం నిమిత్తం పాస్టర్ కె.ఎం.ప్రవీణ్ నాయకత్వంలో యువతీ యువకుల బృందం ఫిబ్రవరి 24వ తేదీన వెళ్లింది. సువార్త సాహిత్యం పంపిణీ చేస్తున్నారు. ప్రభువును రక్షకునిగా అంగీకరించిన వారికి ఆయురారోగ్యాలతో పాటు, సంపదలు కూడా సమకూరుతాయని సువార్తికులు బోధ చేశారు. అక్కడి స్థానికులు కొందరు ఆరెస్సెస్ నాయకులకు ఫోన్‌చేసి, ఈ సమాచారం అందించారు. వెంటనే ఆరెస్సెస్, బిజెపి గూండాలు కర్రలు, ఇనుపరాడ్లు తీసుకువచ్చి, సువార్తికులను బెదరించారు. మతప్రచారం కట్టిపెట్టి తిరిగి వెళ్లిపోవాలన్నారు. అప్పుడు ఇరువర్గాల వారికి వాగ్వివాదం జరిగింది. అప్పుడు ఆ గూండాలు తన వెంట తెచ్చిన కర్రలు, ఇనుపరాడ్లతో సువార్తికులపై దాడిచేసి తలల మీద, కాళ్లు చేతుల మీద బాదారు. సువార్తికుల బృందంలోని యువతులను కూడా బాగా కొట్టారు. వీరిని ముదివేడులోని పోలీసులకు అప్పగించారు.

## ధార్మిక పరిషత్ సరికాదు - మైనారిటీ కమీషన్ బృందం నివేదిక

హైదరాబాద్ : రాష్ట్రంలో హిందూ ధర్మ పరిరక్షణ కోసం సనాతన ధర్మ పరిషత్‌ను ఏర్పాటు చేస్తూ చట్టం చేయడంపట్ల జాతీయ మైనారిటీ కమీషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది రాజ్యాంగంలోని లౌకిక, గణతంత్ర విలువలకు విరుద్ధమని అభిప్రాయపడింది. పలు ఆలయాల పరిధిలో అన్యమత ప్రచారాన్ని నిషేధిస్తూ చట్టం చేయడంపైనా ఆందోళన వ్యక్తం చేసింది. ఉగ్రవాదులతో సంబంధాల పేరుతో ముస్లీం యువకులను పోలీసులు వేధిస్తూన్నారంటూ వచ్చిన ఆరోపణలపై చర్య తీసుకోవాలని కోరింది. క్రైస్తవులు, ముస్లింలను అధికారులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపిస్తూ ఇటీవల మైనారిటీ కమీషన్‌కు ఫిర్యాదు అందింది. దీన్ని పరిశీలించడానికి గతనెల మొదటివారంలో నలుగురు సభ్యుల కమీషన్ బృందం రాష్ట్రంలో పర్యటించింది. కమీషన్ సహ ఛైర్‌పర్సన్ ఎం.పి.పింటో నేతృత్వంలోని ఈ బృందంలో హరిచరణ్‌సింగ్ జోష్, డాక్టర్ దిలీప్ పద్గావ్‌కర్, ప్రొఫెసర్ జోయా హసన్ సభ్యులుగా వున్నారు.

## టీన్ మిషన్స్ ఇండియా - 2008 (గొప్ప ట్రైనింగ్ క్యాంప్)

విజయవాడ, గన్నవరం వద్ద ఈ సంస్థ ద్వారా ప్రతి సం॥రం ఎండాకాలం సెలవులలో యౌవనస్తులకు గొప్ప ట్రైనింగ్ క్యాంపు జరుగుతుంది. ప్రతి సం॥రం వందల కొలది యౌవనులు ఈ క్యాంపులో పాల్గొని ఆత్మీయ మేలు, ఆశీర్వాదములు పొంది గొప్ప సేవకులుగా, సంఘనాయకులుగా, మిషనరీలుగా దేశవిదేశాలలో స్థిరపడి వున్నారు. 13 సం॥లు నిండిన యువతీయువకులు ఈ టి.యం.ఐ క్యాంపులో పాల్గొనవచ్చును. గన్నవరం వద్ద పదిరోజుల ట్రైనింగ్ పొంది, దేశములోని అనేక ప్రాంతములలో సేవ నిమిత్తం టీములుగా వెళ్లి మరల గన్నవరం వచ్చెదరు. ట్రైనింగ్‌లో ఉచిత భోజన వసతులు నెలరోజులు ఏర్పాటు చేస్తారు. ట్రైనింగ్ అనంతరం ఒక టీషర్ట్, బైబిలు, విలువైన సర్టిఫికేట్ ఇస్తారు. రాను పోను చార్జీలు, మీరు కోరుకున్న టీముకు రిజిస్ట్రేషన్ ఫీజు మాత్రమే మీరు భరించవలసిన ఖర్చు. ప్రారంభపు తేదీలు లీడర్స్ సెమినార్ ఏప్రిల్ 22-26 వరకు, బూట్ క్యాంపు ఏప్రిల్ 28 నుండి జూన్ 4 వరకు. రిజిస్ట్రేషన్ మరియు పూర్తి వివరాలకు రెవ. పి.సుధాకర్, టి.యం.ఐ. టౌన్, ఆత్కూర్ పోస్టు, ఉంగుటూరు మండలం, కృష్ణాజిల్లా. ఫోన్:08676-259820, 259920, సెల్: 9440174820. మరియు రెవ. సి.హెచ్. రమేష్‌బాబు, ఒంగోలు, సెల్ : 9440146730.